ఫిబ్రవరి - 2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| యాక్...థూ...ఛీ... | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| అన్న | హన్నాకృప డెస్క్ | 09 |
| దేవుని కొరకు.... | హన్నాకృప డెస్క్ | 11 |
| మరువని దేవుడు | సాక్ష్యం | 13 |
| నీతో ఉండే దేవుడు | చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| భయపడకు దిగులు... | హన్నాకృప డెస్క్ | 20 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 21 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |



**గౌరవ సంపాదకులు :**

**కె. సామ్యేల్ రాజేంద్ర**

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


# HANNA KRUPA

Christian Devotional Monthly Magazine


సంపుటి : 20 సంచిక : 2

ప్రభువగు యెహోవాయే నాకు బలము



సీరియల్ నంబరు

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు  కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

2023వ సంవత్సరములోకి అడుగుపెట్టాము. దేవుని రాకడ సమీపిస్తుంది. రోజులు గడిచే కొద్ది మనుష్యులు మరణానికి దగ్గరవుతుంటారు. క్రొత్త మనల్ని భయపెడుతుంది. రేపటి రోజు మానవులకు క్రొత్తరోజు. రేపు ఇంతకముందు ఎన్నడూ రాలేదు. మరలా మన కొరకు రాదు. మనల్ని వెంబడిస్తూ, భయపెడుతూ వస్తున్న క్రొత్తరోజును  చూసి భయపడవద్దు అన్నాడు ప్రభువు. రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును అన్నాడు.

అసలు మనుష్యులు భయపడటానికి ముఖ్యకారణం దేవుని మరచిపోవటం. మనం మరణించేటంత వరకు మనల్ని విడువక ఎడబాయక కాపు కాస్తున్న దేవుని వాగ్ధానాన్ని గ్రహించకపోవటం. యెహోవా నా కాపరి అని నమ్మకపోవటం. కొందరు అన్ని విషయాలలో సమృద్ధిగా ఉండినా, వారికి రేపు అనే విషయం ఆందోళన కలిగిస్తుంది. కొందరు వచ్చేవారం గురించి, మరికొందరు వచ్చే నెల గురించి, మరి కొందరు వచ్చే సంవత్సరం గురించి భయపడతుంటారు. అందుకే ప్రభువు ఏనాటి కీడు ఆనాటికే చాలును అన్నాడు. అంటే మనం ఈ రోజు విషయం సంతృప్తి కలిగి ఉండమని. అన్నిటికంటే ముఖ్యమైనది మనం విడిచి వచ్చిన మార్గము మనం మరచిపోతుంటాము. మనం నడవబోయే మార్గాన్ని గురించి దిగులు పడటానికి కారణం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభువునుబట్టి ధైర్యముగా ఉండమని మనవి చేస్తున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరు చున్నాను. ఫోన్‌పే ద్వారా చందా పంపదలచివారు 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా  మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి  సామ్యేల్ రాజేంద్ర

K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

సీరియల్



# జఫ్నత్ఫనేహు

(యోసేపు జీవితచరిత్ర)

– కొడవటికంటి

అంతేకాక బబులోను భాష, సిరియా భాష ఒకే విధంగా ఉంటాయి. ఎవరు ఎటుపోయినా, వచ్చినా – పాలస్తీనా, షెకెము, గిలాదు మీదుగా నడువవలసినదే. ఒక విధంగా యెబూసు జనసహిత భూభాగానికి 'కూడలి' లేక 'మధ్య ప్రదేశం' అని చెప్పవచ్చు. తన యజమాని పేరు యూషను. ఐగుప్తులో స్థిరపడినవాడు. వ్యాపారం బాగానే ఉందని ఆయన వాలకం చెప్తున్నది. నేలమీద పరుపు పరచి పెద్ద దిండ్లు మీద ఆనుకొని ఉన్నాడు. యోసేపును చూస్తూ... "ఏ దేశం?" అని అడిగాడు."హెబ్రోను" అన్నాడు వంగి నమస్కరించకుండానే. ప్రశ్న అడిగిన వ్యక్తి కంటే కొంచెం అయినా తక్కువగా కనిపించలేదు. యూషను కొంచెం ఆశ్చర్యపోయాడు. "మీ అమ్మా నాన్న ఉన్నారా?" అడిగాడు యూషను. "నాన్న ఉన్నాడు, అమ్మ లేదు చనిపోయింది" అని చెప్పేటప్పుడు గొంతు కొంచెం వణికింది. అమ్మ మీద ప్రేమకాదు, అమ్మ గుర్తుకు రాలేదు. కాని ఈ విధమైన సన్నివేశము తన జీవితంలో రాలేదు. ఒకసారి షెకెములో తన అన్నలు చెరగొని తెచ్చిన ఇద్దరు మగపిల్లలు – దాదాపు తన వయస్సు వాళ్ళు. వాళ్ళని తను ఈ విధంగా గర్వంగా ప్రశ్నలు వేశాడు. ఇప్పుడు గుర్తుకొచ్చి గొంతు వణికింది. తను ఆ రోజుల్లో ఎంత గర్వంగా ఉండేవాడో ఇప్పుడు ఇక్కడ తనకి అర్థమవుతుంది. తన గర్వం చివరికి తనని ఈ స్థితికి తీసుకొని వచ్చింది. యూషను కొద్దిగా దగ్గటంతో మరలా ఈ గుడారంలో పడ్డాడు. "సిరియా భాష ఎలా నేర్చుకున్నావు?" అడిగాడు యూషను. యోసేపు తల పైకెత్తి చూశాడు. యజమాని తనని ప్రతి అంగుళం పరీక్షిస్తున్నట్లుగా చూస్తున్నాడు.

"నేను హారానులో పుట్టాను. నాకు ఏడు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అక్కడే ఉన్నందున సిరియా నా మాతృభాష అయింది. నేను సిరియా భాష వ్రాయగలను" అని చెప్పాడు. "మీ భాష వ్రాయగలవా?" అడిగాడు యూషను. "మా భాషకు లిపిలేదు. వాడుక భాష మాత్రమే. మొదటి నుండి మేమును, మా పూర్వీకులును, పశువుల కాపరులము అయినందువల్ల మందలకు అనువైన ప్రదేశాలలో నా అన్నలు మందలను కాస్తుంటారు" చెప్పాడు యోసేపు. "అయితే మీ అన్నలు నిన్ను మాకెందుకు అమ్మారు?" అడిగాడు యూషను. "కొన్ని కుటుంబ సమస్యలు కారణం" చెప్పాడు యోసేపు. "నమ్మకంగా ఉండాలి. ఐగుప్తు వెళ్ళటానికి ఇంకా నెలైనా పడుతుంది. నీ బంధకములు ఈ రోజు తీసేస్తారు. ఇక్కడ నుండి నువ్వు పారిపోవటానికి ప్రయత్నిస్తే నీ చెవులకు రంధ్రాలు వేయిస్తాము. అప్పుడు నువ్వు చచ్చే వరకు బానిసగా ఉండాల్సిందే. నువ్వు నమ్మకస్తుడవని నిరూపణ అయితే ఐగుప్తులో విలువైన ప్రదేశాలలో నిన్ను అమ్మేస్తాము" అంటూ ఆగి, దగ్గరకి రమ్మని సైగ చేశాడు. దగ్గరకి వెళితే కూర్చోమన్నాడు. మోకాళ్ళ మీద కూర్చుంటే ముఖం పరీక్షగా చూసి "అష్షూరు" అన్నాడు. యోసేపుకి ఏమి అర్థం కాలేదు."మీ అమ్మ సిరియా దేశస్తురాలా?" అడిగాడు యూషను. "ఔను" అని చెప్పాడు యోసేపు. "అయితే నీవు కూడా అష్షూరీయుడవే" అన్నాడు యూషను. "కాదు, నేను హెబ్రీయుడను" అన్నాడు యోసేపు. "హెబ్రీయులు అష్షూరీయులలో నుండి కాదా వచ్చేది? ఇక వెళ్ళు! నీ సంకెళ్ళు తీసేస్తారు" అని "వియాన్!" అని పిలిచాడు. వియాన్ వచ్చాడు. "నీ దోస్త్ గొలుసులు తీయించు. రెండు రోజులు వెంట వుండి యొప్పే పట్టణం చూపించు. ఒంటెలకి భోజనం బాగా పెట్టండి" అన్నాడు. యోసేపు హృదయం వియాన్ పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. వియాన్ తన

మీద యజమానికి చాలా మంచిగా చెప్పాడు అనుకున్నాడు. కాని వియాన్ కంటే వేరొక వ్యక్తి ఈ విషయంలో తన తరపున పనిచేస్తున్నట్లు అనిపించింది. అది హృదయం అనుభవించిన సాక్ష్యం. ఇద్దరూ కలిసి ఒక గుడారం వద్దకు వెళ్ళారు. ఒక బానిసని పిలిచి వాళ్ళ భాషలో ఏదో చెప్పి సంకెళ్ళు చూపించాడు. బానిస కూడా యోసేపును ఎంతో ప్రేమగా చూశాడు. సాధారణంగా బానిసలు ఎవరినీ ఆప్యాయంగా చూడరు. కాని ఇక్కడ అందరూ యోసేపును ప్రేమగా చూడడం ఎలా జరిగింది? వియాన్ ఆలోచించే కొద్దీ... ఏదో దైవశక్తి యోసేపును కాపాడుతున్నట్లుగా అనిపించింది. ఇప్పుడు యోసేపు బంధవిముక్తుడయ్యాడు.

రెండవరోజు ఉదయాన్నే వియాన్ తన దుస్తులలో ఒక మంచి జతను యోసేపుకు ఇచ్చాడు. ఇద్దరూ యజమాని యొద్దకు వెళ్ళి నిలబడ్డారు. యోసేపుకు బట్టలు కొనడానికి ఆయన కొద్దిగా డబ్బు వియాన్‌కి ఇచ్చాడు. యొప్పేకు ఉత్తరంగా ఒక మైలు దూరంలో విడిదిచేసిన ఒంటెలను దాటి, బయటకు వచ్చేటప్పటికి ఉదయం మొదటిజాము అయింది. దక్షిణంగా రెండు మైళ్ళు నడిచేటప్పటికి సముద్రం వచ్చింది. ఆ తీరం వెంబడి నడుస్తున్నారు. చర్మకారుల ఇళ్ళను సమీపించారు. ఆ చర్మాలను బాగుచేసేటప్పుడు వచ్చే వాసన భరించలేనిది. అందువల్ల వీరు ఊరికి దూరంగా ఇళ్ళు కట్టుకున్నారు. కొన్ని ఇళ్ళు గుండ్రంగా ఉన్నాయి. మిద్దెలన్నీ గట్టివి. దక్షిణంగా ముందుకుపోతే రేవు మొత్తం కనబడుతుంది. అర్ధచంద్రాకారంలో ఉన్న రేవు చాలా అందంగా ఉంటుంది. ఈ అర్ధ చంద్రాకారం మధ్యలో నుండి మొలిచినట్లు ఉండే నిటారైన కొండ. ఆ కొండ చుట్టూ యొప్పే పట్టణం. పెద్ద ఓడలేవి కూడా రేవులోకి రావు. ఒక మైలు దూరంలోనే లంగరు వేసి ఉంటాయి. అక్కడ నుండి చిన్న తెడ్ల పడవలతో సరుకు ఒడ్డుకు చేరుస్తారు.

దాదాపు ఇరవై పెద్ద ఓడలు సముద్రంలో లంగరు వేసి ఉన్నాయి. వాటిమీద వాటిదేశం యొక్క గుర్తులు వేసియున్నాయి. రంగు రంగుల జెండాలు నిలబెట్టి ఉన్నాయి. తన జీవితంలో మొదటిసారి సముద్రం చూస్తున్నాడు. యోసేపు తన్మయుడైపోయాడు, ఇంతవరకు అంచు తెలియని ఎడారులు చూశాడు. దేవుడు తన తండ్రితో, తాత (అబ్రాహాము)తో మాట్లాడుతూ 'నేను నిన్ను ఆశీర్వదించి ఆకాశ నక్షత్రములవలెను, సముద్రపు ఇసుక రేణువుల వలెను నీ సంతానమును నిశ్చయముగా విస్తరింపజేసెదనని' ఆశీర్వదించాడని విన్నప్పుడు సముద్రము ప్రక్కన ఎంత ఇసుక ఉంటుందోనని అనుకొనేవాడు. కాని ఈ రోజు మొదటిసారిగా సముద్రాన్ని చూసిన తర్వాత సముద్రమంతా ఇసుక మీదనే ఉన్నట్లు అనిపించింది. దేవుని ఆశీర్వాదము ఎప్పుడూ మనిషి ఊహకు మించే ఉంటుంది కాబోలు అనుకున్నాడు. ఆ ఆశీర్వాదములో తను కూడా కార్యకర్త. కనుకనే దోతానులో మరణము నుండి తప్పించి, దేవుడు ఐగుప్తుకు తీసుకువెళ్తున్నాడు.

మొదటిరోజు దేవుని మీద చాలావరకు నమ్మకం పోయినది. ఎందుకంటే దేవుడు తనను కాపాడితే తను ఈ విధంగా అన్యాయం అనుభవించుతాడా? అని అనుకున్నాడు. అయితే ఇప్పుడు ఇక్కడ తన మనస్సుకు నెమ్మది కలిగిన తర్వాత, సర్వశక్తుని క్రియలను గురించి యధార్థంగా ఆలోచించగలిగాడు. ఆయనను గూర్చి యధార్థంగా ఆలోచించే వారికి మాత్రమే సత్యం తెలియపరచబడుతుంది. ఇక్కడికి సముద్రం ప్రక్కనున్న కొండ పూర్తిగా కనబడుతుంది. పూల తోటలు పండ్లతోటలు కనబడుతున్నాయి. రేవులోకి వస్తే అన్ని జాతులవారు ఉన్నారు. వ్యాపారస్తులు, బానిసలు, సిపాయిలు, జమిందారులు, స్త్రీలు ఉన్నారు. వియాన్ చెప్తున్న మాటలు వింటుంటే ఆశ్చర్యమేసింది. ఇంత వ్యాపారం జరుగుతున్నా ఇందులో అరవై శాతం మోసంతోనే జరుగుతుందట. మానవుని కోసం అన్ని వసతులు కల్పించిన ఈ పట్టణంలో బ్రతకటానికి వేరొక వ్యక్తిని మోసం చెయ్యాల్సిన అవసరం ఏమిటంటే – "ఉన్నది పోతుందనే భయంతో, లేనిది కావాలనే కోరికతో మానవుడు ఈ స్థితికి వచ్చాడు" అని అన్నాడు వియాన్.

రేవు దాటి దక్షిణంగా వెళ్తుంటే చర్మకారుల ఇళ్ళదగ్గర పెద్ద గొలుసు సముద్రపు ఒడ్డున జాగ్రత్తగా బిగించబడి


ఉంది. దాని ఇంకో కొనకు అనేక రకాలైన చర్మాలు కట్టబడి సముద్రంలో మునుగుతూ, తేలుతూ ఉన్నాయి. నాలుగైదు ఇళ్ళకు ఒక పెద్ద తొట్టి కట్టబడి ఉంది. సముద్రంలో కొంతకాలం నానిన చర్మాలను ఈ తొట్టెలలో కొంతకాలం బాగు చెయ్యాల్సి ఉంది. అప్పుడు అర్థమైంది – చర్మకారులు సముద్రం ప్రక్కనే ఇళ్ళు ఎందుకు కట్టుకున్నారో! ఏ పట్టణంలోనైనా మనుష్యులను గురించి తెలియా లంటే ఆ ఊరి సంత దగ్గరకు వెళ్ళాలి. వేరే ఆలోచనలు ఏమి లేకుండా కేవలం మనుష్యుల ఆలోచనలు, మనస్తత్వాలు, అలవాట్లు మాత్రమే సంతలో గమనించాలి. వారి ఆహారపు అలవాట్లు, వారు కౄరులా? సాధువులా? అన్నీ తెలుసుకోవచ్చు అని అనుకున్నాడు యోసేపు. పట్టణంలోకి ప్రవేశించగానే అన్ని జాతుల వారు కనిపించారు. ఇక ప్రయాణమంతా చల్లగా సముద్రపు దరిదాపుల్లోనే సాగింది. ఒంటెలు కూడా తొందరగానే నడిచాయి. రాత్రులు విశ్రాంతి తీసుకోవటానికి వీలుగా పట్టణాలు దగ్గరదగ్గరగానే ఉన్నాయి. యొప్పేలో పదిరోజులు ఉన్నారు. యొప్పే దాటిన తర్వాత గాజా దాకా ప్రతి పది మైళ్ళకు ఒక పట్టణం కలుస్తుండేది. ఎలాగైతేనేమి నలభైమైళ్ళు ప్రయాణం చేసి యొప్పే దాటిన తర్వాత ఎలిటెక్కి, అష్దాదు, ఆష్కేలాను దాటి ఆ రాత్రి మొదటి జాము మధ్యలో గాజా చేరారు.

ఫిలిష్తీయుల దేశమంతటిలో గాజా పట్టణం గొప్పది. ఫిలిష్తీయులు మొదటి నుండి బలవంతులు. యోసేపు గాజా పట్టణాన్ని చూసినప్పుడు అది నెఫీలుల పట్టణమేమో అను కున్నాడు. తన తండ్రి, అన్నదమ్ములు ఆస్థితో షెకెము నుండి బేతేలు చేరి అక్కడ నుండి హెబ్రోను చేరినప్పుడు మొదటి సారిగా తన తాతని చూశాడు. చాలా వృద్ధుడు. రెండు కళ్ళు పూర్తిగా కనిపించవు. తల్లి చనిపోయిన దిగులులో ఉన్నానని ఎప్పుడూ తన దగ్గరే కూర్చోబెట్టుకొని ఎన్నో సంగతులు చెప్పేవాడు. పూర్వకాలంలో ఒకప్పుడు దేవుడు ఈ భూలోకం మొత్తాన్ని నీళ్ళతో ముంచేశాడంట. అప్పుడు భూమి మీద ఉన్న సర్వశరీరులు నీళ్ళలో మునిగి పోయారంట. నోవహు అనే ఆరువందల సంవత్సరాల ముసలాయన, ఆయన ముసలామె, ముగ్గురు కొడుకులు, కోడళ్ళు, వాళ్ళతో పాటు ఓడలో ఉన్న జంతువులు, పక్షులు మాత్రం బ్రతికి ఈ లోకంలో బట్టకట్టారంట. కాని గమ్మత్తుగా ఒకటి జరిగింది. జలప్రళయం రాకముందు భూమి మీద నెఫీలులు ఉండేవారు. జలప్రళయం తర్వాత కూడా ఈ భూమి మీద ఉన్నారంట. ఆ నెఫీలులే ఇప్పుడు హెబ్రోను నుండి గాజా వరకు నివసిస్తుంటారని తన తండ్రి చెప్పే వాడు. ఈ నెఫీలులు ఆరు మూరల నుండి ఏడు మూరల వరకు ఎత్తుగా బలంగా ఉంటారని, వీరిలో చాలామందికి చేతికి కాలికి ఆరేసి వ్రేళ్ళ చొప్పున ఉంటాయని, వారి ఈటె – నేతగాని దోనే అంత ఉంటుందని చెప్పాడు. ఇప్పుడు వారు బహుశా ఫిలిష్తీయుల గాతు పట్టణంలో ఉండవచ్చునని చెప్పాడు. గాతు పట్టణం గాజా పట్టణానికి సమీపమున ఉంది గనుక, యోసేపు గాజా పట్టణాన్ని ఖచ్చితంగా తిరిగి చూడాలని అనుకున్నాడు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపదలచినవారు**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# 'యాక్... థూ... ఛీ'



అసహ్యమైన దానిని చూస్తే 'యాక్... థూ... ఛీ' అని కళ్ళు మూసుకొని, ముక్కు మూసుకొని, ఉమ్మేసి వెళ్ళిపోతాం కదా! బురదలో పొర్లాడే పందిని చూసి అసహ్యించు కుంటామే కానీ, ఆహా ఎంత బాగా పొర్లాడుతుంది అని కాసేపు అక్కడే నిలబడి వేడుక చూస్తామా, ఛీ... ఛీ... అనుకుంటూ వెళ్ళిపోతాము. కొంతమంది మనుష్యులను చూస్తే కూడా మనకి అసహ్యమేస్తుంది. త్రాగుబోతులను చూచినా, దొంగతనం చేసేవాళ్ళని, వ్యభిచారం చేసేవాళ్ళని చూచినప్పుడు మనకి అసహ్యం కలుగుతుంది. వాళ్ళు చేసే పనులు మనకి నచ్చక పోతే వాళ్ళకి ఆమడ దూరంలో ఉంటాము. మనం చాలా నీతిమంతులమన్నట్లు వాళ్ళ దరిదాపుల్లోకి మనం వెళ్ళక పోవడమే కాకుండా ఇతరులకు కూడా చెప్తాము, వాళ్ళ దగ్గరకు వెళ్ళకండి వాళ్ళు మంచోళ్ళు కాదు అని. ఇతరులను చూచి మనం ఎలా అసహ్యించుకుంటామో మనం చేసే పనులు దేవునికి నచ్చకపోతే దేవుడు కూడా మనల్ని అలానే అసహ్యించు కుంటాడు. *'మీరు మనుష్యుల యెదుట నీతిమంతులని అనిపించు కొనువారు గాని దేవుడు మీ హృదయములను ఎరుగును. మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము' (లూకా 16:15).* ఏదైతే మనకి మనం గొప్పగా భావిస్తామో దానిని దేవుడు అసహ్యించుకుంటాడు. మనం ఏ పని చేసినా మనుష్యులను దృష్టిలో పెట్టుకొనే చేస్తాము. అందరూ మనల్ని పొగడాలని, గొప్పగా అనుకోవాలని చాలా కష్టపడతాము. పైసా పైసా కూడబెట్టి బాగా డబ్బు దాచిపెట్టి, చాలకపోతే అప్పులు చేసైనా సరే అందమైన ఇల్లు కట్టుకొని, ఖరీదైన వస్తువులు కొంటాము. ఖరీదైన బట్టలు, నగలతో అలంకరించుకోవడం ఇదంతా మనుష్యుల మెప్పు కోసమే. ఉద్యోగం చేసినా, వ్యాపారం చేసినా మనుష్యుల ముందు ఘనంగా ఉండటానికే. లక్షల రూపాయలు ఖర్చు చేసి పెళ్లి చేసినా, ఫంక్షన్ చేసినా ఎవరూ వేలెత్తి చూపించకూడదని మనుష్యుల కోసమే చేస్తాము తప్ప దేవుడు వచ్చి భోజనం చేసి వెళ్తాడు అని దేవుని కోసమేమి చేయము. *'వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి' (యోహాను 12:43).* మనుష్యులు మనల్ని చూచి ఆహా, ఓహో అంటుంటే మనం గాల్లో తేలిపోతుంటాము. మన కష్టానికి ఫలితం దక్కిందని సంబరపడిపోతాము. ఇదంతా దేవుని కోసం చేస్తామా? దేవుడు మనల్ని చూసి 'శెబాష్ బిడ్డా' అని అనాలని ఇంత కష్టపడతామా? అంతేకాక మన భక్తి కూడా మనుష్యుల మెప్పును ఆశించే ఉంటుంది. భక్తిపరులు, నీతిమంతులు అని మనుష్యులచే గుర్తింపు పొందటానికి తెగ ఆరాటపడి పోతాము. ఇలా మనం చేసే ప్రతీ పని మనుష్యులని దృష్టిలో పెట్టుకొనే చేస్తాము తప్ప, దేవుని దృష్టిలో పడాలని మాత్రం కాదు. దేవుని కంటే మనుష్యులకు ఎక్కువ విలువ ఇచ్చే వాళ్ళని చూస్తే దేవునికి అసహ్యము. ఒకవేళ తమ్మును తాము తగ్గించుకొని దేవుని మెప్పు పొందాలనుకొనే వాళ్ళు దేవునిబట్టి మనుష్యులను ప్రేమిస్తారే కానీ, మనుష్యుల మెప్పు ఆశించరు. కేవలం తమ్మును తాము హెచ్చించుకొనే వారు మాత్రమే మనుష్యుల వలన ఘనత ఆశిస్తారు. మనుష్యుల వలన ఘనత ఆశించి చేసే పనులు దేవునికి అస్సలు నచ్చవు. మనకి నచ్చని వాటిని చూచి మనం ఎలా అసహ్యించుకుంటామో, దేవునికి నచ్చని వాటినిబట్టి **'యాక్... థూ... ఛీ'** అని దేవుడు కూడా మనల్ని చూసి అసహ్యించుకుంటాడు. వినుటకు చెవులు గలవాడు వినును గాక!

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9440217726**

సీరియల్

4

# నా చిత్తానుసారుడు

– కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

ఎంత ఆదరణగల కళ్ళు, నిశ్చలమైన ముఖం అప్పుడే దైవధ్యానము చేసి లేచిన వాని ముఖమువలె ప్రకాశము. తరువాత సౌలురాజు వైపు చూచినప్పుడు సేదదీరిన నిశ్చలత కనిపించింది. యోనాతాను, ఔను ఆయన దైవభక్తి, దయగల హృదయం గలవాడని చాలా మంది ద్వారా విన్నాడు. "అరణ్యములో నివశించాలని ఉందా?" అన్నాడు యోనాతాను నవ్వుతూ. "నాకు పది సంవత్సరాల వయస్సు నుండి పగలంతా అరణ్యములోనే నివశిస్తున్నాను. ఈ సితారా నాకు తోడు" సితారా అంటునే ఈ రోజు సితార స్థానము ఆక్రమించిన మీకాలు వైపుకు అనుకోకుండా తన కళ్ళు వెళ్ళాయి. ఎందుకు తనకు ఇలా అయింది అనుకొంటుంటే "ఈ పాట నీకెవరు నేర్పారు?" అన్న సౌలువైపు చూచి తలవంచుకున్నాడు. "ఈ పాట నీకెవరు నేర్పారు, ఎవరు వారు?" అన్నాడు సౌలు. తల పైకెత్తి చిన్నగా "నేనే వ్రాశాను, స్వరకల్పన నాదే" అన్నాడు. కొన్ని క్షణాలలో తన ఎదురుగా చిన్న అరుగు మీద కూర్చుని సితారా వాయిస్తున్న యౌవ్వనుడు తన కంటే ఎత్తైన ఆసనం మీద కూర్చున్నట్లు అనిపించింది సౌలుకు.

పెద్ద స్వరంతో అదే శృతిలో సితార కలుపగలిగిన అతని నైపుణ్యతకు ఇంతవరకు ముగ్ధుడైన యోనాతానుకు తన జీవితంలో ఇటువంటి వ్యక్తిని చూడలేదనిపించింది. తన తండ్రి భుజము మీద నుండి చేయి తీసి పరుగెత్తుకుంటూ వెళ్లి దగ్గరగా కూర్చుని ఇంకొక పాట పాడండి అని అనాలని అనిపించింది మీకాలుకు. వెంటనే సిగ్గు దొంతరైంది. చాలా నెలల తర్వాత సౌలు హృదయం సేదదీరినట్లనిపించింది. కాని వెంటనే 'ఈ భావన ఎంతసేపు?' అనుకొన్నాడు. ఇప్పటిదాక ఏదో మైకంలో ఉన్నానేమో అనిపించింది. అయినా ఈ మైకం తెప్పించగల దావీదు తన దగ్గరలో ఉంటేనే మంచిది అనుకున్నాడు. "నాన్న, దావీదుకు బస ఎక్కడ ఏర్పాటు చెయ్యమంటారు?" అడిగాడు యోనాతాను. "ఇక్కడే, భోజనశాల ప్రక్కగది" అన్నాడు సౌలు. రెండవరోజు ఉదయం కూడా సౌలు రాజు సముఖంలో సితార వాయించాడు దావీదు. అప్పుడే మొదటిసారి సైన్యాధిపతియైన అబ్నేరును చూసింది. సౌలుకంటే పొడవుగా ఆయన కంటే బలంగా ఉన్నాడు. రెండు రోజుల తర్వాత సెలవు తీసికొని బేత్లెహేము వచ్చాడు. తండ్రితో జరిగిన సంతులన్ని చెప్పాడు. మరునాడు ఉదయాన్నే అబీషైతో కలిసి గొఱ్ఱెలను నడిపించాడు. కాపరులకు గొఱ్ఱెలను అప్పచెప్పి చెట్టుక్రింద కూర్చున్నారు. దావీదుకు మనస్సులో ఎన్నో ఆలోచనలు ఇంత వరకు జీవితంలో జరగని అనుభవాలు.

"రాజభవనం ఎలా ఉంది?" అడిగాడు అబీషై. "రాజ ప్రాంగణం కంటే అక్కడ నివశించే మనుష్యులే రకరకాలుగా ఉన్నారు" అని మొదలుపెట్టాడు దావీదు. మొదట నుండి అన్ని అనుభవాలు చెప్పాడు. "అబ్నేరు సౌలుగారి చిన్నాయన కొడుకేనటగా" అన్నాడు. యోనాతాను విషయం చెప్పినప్పుడు "రాజ ప్రాంగణంలో నివశిస్తూ యువరాజై యుండి అంత మెత్తని మంచి మనస్సు ఎలా కాపాడుకుంటున్నాడు" అన్నాడు అబీషై. ఏ క్షణానైనా సౌలు రాజుకి బాగలేకపోతే సితార వాయించ టానికి, యుద్ధం వస్తే ఆయన ఆయుధములు మోయువాని గానైనా వెళ్లవలసి యుంటుంది" అన్నాడు దావీదు భారంగా నిట్టూరుస్తూ.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. నెలరోజులకు ఒక్కసారైనా గిబియా వెళ్ళి నాలుగురోజులైనా సౌలు దగ్గర ఉండవలసి వస్తుంది. ఒకరోజు గొఱ్ఱెల కాపరులంతా తలా ఒక ప్రక్క వాటిని మేపుతున్నారు తను సితారా తీగలు సరిచేస్తున్నాడు. ఇంతలో కాపరులందరూ ఒక్కసారిగా పెద్దగా అరుస్తూ తనవైపు రావడం, గొఱ్ఱెలు నాలుగు ప్రక్కలా చెదరిపోవటం గమనించాడు. ఒక్కసారి గుండె ఝల్లుమన్నది.

“సింహం... సింహం...” అని అరుస్తూ వస్తున్నారు. ప్రక్కనే ఉన్న మట్టి దిబ్బ మీదకు పరుగెత్తాడు దావీదు. ఇరవై గజాల దూరంలో సింహం ఒక గొఱ్ఱెపిల్ల నడుం కరుచుకొని చిక్కని అడవివైపు వెళ్తున్నది. తనకు తెలియకుండానే సితార ప్రక్కన పెట్టి కఱ్ఱ తీసుకొని దానివైపు పరుగెత్తాడు. తను వేసే ప్రతి అడుగకు తనలోనికి ఏదో శక్తి ప్రవహిస్తున్నట్లు అనిపించింది. సింహం దగ్గరకి వచ్చినప్పుడు తాను ఏనుగంత ఎత్తైనట్లు అనిపించింది. ఒళ్ళంత వేడిగా కోపంతో మండిపోతున్నది. ఇది ఒక క్రొత్త అనుభవమే. తన దృష్టి అంతా సింహం పట్టుకొన్న గొఱ్ఱెపిల్ల మీదనే ఉన్నది. సింహం జూలు రెండు చేతులతో పట్టుకొని ప్రక్కగా విసరి వేస్తుంటే అది గాండ్రించి మీదకు వచ్చింది. క్రిందపడిన తన కఱ్ఱ రెండు చేతులతో పట్టుకొని బలంగా తలమీద కొట్టాడు. అది వెనక్కి పడిపోతుంటే దాని రెండు ముక్కు రంధ్రాలలో తన చేతివ్రేళ్ళు పోనిచ్చి క్రింది దవడ పట్టుకొని చీల్చినప్పుడు చిన్న గొఱ్ఱెపిల్ల దాని నోటినుండి బయటపడింది. కాని దాని నోరు మూత పడలేదు. దాని నోరు అట్లానే చీల్చు తుంటే అది బాధగా మూలిగింది. అది చనిపోయేంత వరకు వదలలేదు. అసలు ఏం జరుగుతుందో తనకు తెలియటం లేదు. అసలు తాను కాక ఇంకెవరో ఈ పనిచేస్తున్నట్లుగా అనిపించింది. పెద్ద కాపరి ఏతాను తన భుజం మీద చెయ్యివేసి “అది చనిపోయింది వదలండి” అన్నప్పుడు తన చేతి వేళ్ళు వదులయ్యాయి. సింహం శవం నేలన దబ్బున పడింది. ఇప్పుడు తాను అలసిపోయినట్లు అనిపించింది. సింహం తనకు ఎదురు తిరిగినప్పుడు దాని గోళ్ళు గీరిన చారలు తన రొమ్ముమీద చేతుల మీద నొప్పి చేస్తున్నవి. ఆ రాత్రి బేత్లెహేమంతా ఇదే కథ. మరలా ఒక నెల తర్వాత దావీదు తూర్పు తట్టు మంచెవైపు వెళుతున్నప్పుడు వెనుక నుండి ఒక ఎలుగు శబ్దం వినిపించింది. ఆ తట్టు తిరిగి చూస్తే అది పదిగజాల దూరంలోనే ఉంది. అది తనమీదకే వస్తుంది. ఏ ఎలుగైనా ఏదో విధంగా మనిషికి హాని చేయకుండా పోదు. తన చేతిలోని కఱ్ఱ దానికి చూపిస్తే వెనుదిరుగుతుంది అనుకొన్నాడు. కాని అది ఇంకా పెద్దగా బొబ్బరిల్లుతూ, మీదకు వస్తుంది. తను కదలకుండా నిలబడ్డాడు. అది తనవైపునకు వేసే ప్రతి అడుగు తనలో తాను సింహం మీదికి వెళ్ళినప్పటి అనుభూతి కలుగజేసింది. తాను ఎత్తుకు ఎదిగిపోతున్నట్లు అది చాలా చిన్న జంతువులా మారుతున్నట్లు, అది తనకు అందుబాటులోనికి రాగానే దాని గడ్డం ఎడమచేతితో పట్టుకొని తలమీద కుడి పిడికిలితో కొట్టినప్పుడు సమ్మెట మోత వినిపించింది. తన కాళ్ల దగ్గర ఎలుగుబంటి కుప్ప కూలి చచ్చిపడింది. కాపరులు వచ్చి ఆ ఎలుగును వెళ్ళికిలా పడేశారు. ఇంత పెద్ద ఎలుగును ఇంతకు ముందు ఎన్నడు చూడలేదన్నారు. అబీషై వచ్చి తన భుజం మీద చెయ్యివేసి “ఇది మానవ శక్తి కాదు సుమీ” అన్నాడు. ఆ రాత్రి కూడా బేత్లెహేములో ఇదే కథ.

ఆ రాత్రి సౌలు సైన్యాధిపతి దగ్గర నుండి భటులు ఇశ్రాయేలు అన్ని గ్రామాలకు బయలుదేరారు. ఒక భటుడు యెష్షయి ఇంటికి వచ్చాడు అర్ధరాత్రి అయింది. యెష్షయి కొడుకు షమ్మా బయటకు వచ్చాడు. ఫిలిష్తీయులు శోకోలో యుద్ధమునకు కూడినారు. సైనికులు అందరూ వెంటనే రావాలని ఆజ్ఞ. వెంటనే పెద్దన్న ఏలీయాబు రెండవ అన్న అబీనాదాబు షమ్మా సిద్దపడి ఆ రాత్రే వెళ్ళిపోయారు. ఉదయాన్నే లేచి దావీదు తన కంచర గాడిద మీద గిబియా వైపుగా ప్రయాణమైనాడు. తాను గిబియా చేరినప్పుడు సౌలు యెబూసు కోటకు వెళ్లాడని, యోనాతాను అబ్నేరు యుద్ధ భూమిలో ఉన్నారని తెలిసింది. వెంటనే దావీదు యోబూసు వెళ్ళాడు. యోబూసును కొందరు యెబూసీయులు పరిపాలి స్తున్నారు. వారి రాజు మరణానంతరం వారసుడు స్థిరపరచ బడే వరకు వారు పరిపాలిస్తారు. సౌలు రాజునకు వారితో మంచి స్నేహం ఉన్నందున, యోబూసీయులకు ఫిలిష్తియు లకు సరియైన సహవాసము లేనందున సౌలు యోబూసీ యులతో స్నేహం కలిగియున్నాడు. దావీదును చూడగానే సౌలు ముఖం వికసించింది. దావీదు వెంటనే సౌలు ఆయుధాలు తీసుకున్నాడు. వారిద్దరు ఇంక కొందరు సైనికులు ఎవరి వాహనముల మీద వారు ఏలా లోయవైపుగా బయలుదేరారు.

**(సశేషం)**

స్త్రీల విభాగము

# అన్న

దేవుని మహాపరిశుద్ధ నామంలో పాఠకులందరికి వందనములు. బైబిల్లోని స్త్రీలను ధ్యానిస్తున్నాం దానిలో భాగంగా ఈ సంచికలో ప్రవక్తియైన అన్న గురించి మనం తెలుసుకుందాము.

క్రొత్త నిబంధనలో చెప్పబడిన ఒకే ఒక ప్రవక్త్రి అన్న. అన్న గురించి కేవలం లూకా సువార్తలోనే చెప్పబడినది. అది కూడా కేవలం మూడు వచనాలే. లూకా 2:36-38. అన్న అనే పేరు లింగబేధం లేకుండా స్త్రీ, పురుషులు ఇద్దరికి వాడబడడం ఆ పేరుకున్న ప్రత్యేకత. అయితే కేవలం ఆమె పేరుకే కాక ఆమెకు కూడ కొంత ప్రత్యేకత ఉన్నది. అందుకే ఆమె పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించింది. అన్నను ప్రత్యేక పరచిన ఆమె గుణ లక్షణాలను ధ్యానిద్దాం.

**భయభక్తులు గలిగిన జీవితం:** అన్న వివాహానికి ముందు ఆమె జీవితం గురించి ఏమియు తెలుపబడలేదు కేవలం ఆమె ఆషేరు గోత్రానికి చెందినది. ఆమె తండ్రి పేరు పనూయేలు. ఆమె ఒక ప్రవక్త్రి అని వ్రాయబడింది. బహుశా ఆమె వివాహానికి ముందే ప్రవచించే వరము కలిగి ఉండ వచ్చు. వివాహానికి ముందే ఆమె ప్రవక్త్రి అనునది నిజమైతే అన్న యొక్క బాల్యము యవ్వనము దేవునియందు భయ భక్తులతో గడిచినది అని చెప్పవచ్చు. ఎందుకంటే రాబోవు వాటిని, జరగబోవు సంగతులను ముందుగా చెప్పేవారిని ప్రవక్త/ ప్రవక్త్రి అని అంటాం. దేవునితో అనుదిన వ్యక్తిగత సహవాసము లేకుండా భవిష్యత్ విషయాలను గురించి ప్రవచించుట అసాధ్యము. కాబట్టి అన్న చిన్నతనము నుండి దేవునియందు భయభక్తులు కలిగినది అనుటకు కొంత సంభావ్యత ఉన్నది. లేదా వివాహానంతరం ఆమె నిత్యము, దేవాలయము విడువక చేసిన సేవ, దేవునియందలి భయభక్తులు ఆమెను ప్రవక్త్రి స్థాయికి తీసుకెళ్ళాయి.

దేవున్ని ఎరిగిన మన భక్తి జీవితం ఎలా ఉన్నది? ప్రవచించే వరముతో సంబంధము లేకుండా మన వ్యక్తిగత జీవితం దేవుని ఎదుట నిష్కళంకముగా ఉన్నదా లేదా అని భయము కలిగి అనునిత్యం పరీక్షించుకొనుచు, భక్తితో సరిచేసుకొనుచు దేవుని ఎదుట భయభక్తులు కలిగి జీవించ వలసినవారమై ఉన్నాము. అది క్రైస్తవ స్త్రీలకు ఉండవలసిన లక్షణం.

అన్న భక్తి జీవితం తన వరకే కాక తన తండ్రికి, గోత్రానికి కూడ బైబిల్లో స్థానం సంపాదించుటకు కారణ మైంది. భయభక్తులు కలిగిన నీ జీవితం నీ తండ్రికి, నీ పుట్టింటి వారికి, మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెడుతుంది.

*"యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడ బడును" సామెతలు 31:30*

**దేవునిపై ఆధారపడుట:** ఏడు సంవత్సరములు వైవాహిక జీవితం అనంతరం అన్న వైధవ్యం అనుభవించవలసి వచ్చింది. మంచి యవ్వన వయస్సులో విధవరాలైంది. ఆ కాలం నాటి పరిస్థితులను బట్టి ఆలోచిస్తే విధవరాలైనప్పుడు అన్న వయస్సు 25 సంవత్సరముల లోపే అయిఉంటుంది. ఎవరైనా వివాహం చేసుకునేది ఎందుకు? ఈ లోకంలో జీవించినంత కాలం తోడు ఉంటారని. కానీ అన్నకు చిన్న వయస్సులోనే తన తోడు దూరమైంది. ఎవరిని ఆధారము చేసుకొని తన భవిష్యత్తు ఊహించుకుందో ఆ ఆధారము మరణించడంతో తన కలలు, భవిష్యత్తును గూర్చిన తన ఆలోచనలు, ప్రణాళికలు అన్నీ కుప్పకూలిపోయాయి. ఒంటరిదైంది. ఎంతో కుమిలిపోయి ఉండవచ్చు, కన్నీరు కార్చి ఉండవచ్చు. అందుకే అన్న ఈ సారి పరిస్థితులకు అతీతుడును ఎన్నటికి చేయి విడువని, నమ్మదగిన దేవునిపై ఆధారపడి జీవించుటకు నిర్ణయించుకున్నది. దేవునిపై ఆనుకున్నది. రెండవ వివాహం చేసుకొని అందరివలె సాధారణమైన జీవితాన్ని జీవించుటకు అన్నకు అవకాశము ఉన్నది. రెండవ వివాహానికి సంబంధించి సలహాలు సూచన లు, ప్రతిపాదనలు ఆమెకు అంది ఉండవచ్చు. కానీ అన్న

లోకానుసారముగా ఆలోచించక, తన భవిష్యత్తు గురించి చింతించక, సామాజిక పరిస్థితలకు భిన్నంగా, తన ఆప్తుల ఆలోచనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకొనుట ధైర్యంతో కూడిన విషయం. అంత ధైర్యాన్ని ప్రదర్శించడానికి కారణం ఆమె నిర్ణయానికి ఆధారమైన దేవుడు. దేవునిపై ఆధారపడిన వారు మాత్రమే సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలరు.

నీవు ఎవరి మీద ఆధారపడి జీవిస్తున్నావు? కష్టంలో ఇబ్బందిలో ప్రతి క్రైస్తవురాలు దేవునికి ప్రార్థిస్తుంది. అయితే అది దేవుని మీద ఆధారపడటం కాదు. సమాజ పోకడకు భిన్నంగా, దేవుని కొరకు లోకానికి ఎదురీదే పరిస్థితిని స్వాగతించగలగడం దేవుని మీద ఆధారపడి జీవించడం.

**మంచి సాక్ష్యము కల్గియుండుట:** అన్న కేవలం నిర్ణయం తీసుకోవడం మాత్రమే కాదు తను వృద్ధురాలైనంత వరకు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంది. అందరివలె సుఖవంతమైన జీవితము కాక ఒంటరిగా కష్టపడి జీవించింది. ఆర్థికపరమైన సమస్యలు, ఆరోగ్య సమస్యలు, నిత్యావసరాల కొరకు కొంత శారీరిక శ్రమ అన్న ఎదుర్కొని ఉండవచ్చు. ఆమెకు ఎన్నో శోధనలు వచ్చి ఉండవచ్చు. వాటన్నిటిని అన్న ఉపవాస ప్రార్థనలతో జయించింది. ఉపవాసము అంటే శరీరమును నలుగుగొట్టుకొనుటలో ఒక భాగము. శరీరమును తృణీక రించుకుంటూ, ప్రార్థనతో దేవునికి సమీపంగా జీవించుటే ఉపవాసప్రార్థన. *"ఎనుబది నాలుగు సంవత్సరములు విధవరాలై ఉండి దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్ళు సేవ చేయుచుండెను"* అన్ని సంవత్సరములు దేవునికి నమ్మకముగా జీవించుచు, జనుల యెదుట, దేవుని ఎదుట తన సాక్ష్యమును కాపాడుకున్నది.

నీకు ఉపవాస ప్రార్థన అనుభవము ఉన్నదా? నీకు సంఘములోను, కుటుంబములోను సాక్ష్యము ఉన్నదా? సాక్ష్యము కలిగి యుండుట, దానిని అంతము వరకు కాపాడుకొనుట క్రైస్తవ స్త్రీలు కోరదగిన విషయం.

**సహవాసము:** *"ఆమె కూడ ఆ గడియలోనే లోపలికి వచ్చి, దేవుని కొనియాడి, యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాటలాడు చుండెను"* అన్న సహవాసము తన వలె యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుకొను వారితో ఉన్నది. అందుకే ఆమె యేసును చూచి, ఆయనను కొనియాడిన తరువాత వారితో యేసును గూర్చి మాట్లాడింది. దేవుని ఎరిగిన బిడ్డల తోనే అన్న సహవాసమున్నది. అలాగే వారితో ఏదో పిచ్చా పాటి కాకుండ దేవుని సంగతులను గూర్చి మాట్లాడింది.

మరి నీ సహవాసము ఎవరితో ఉన్నది? అందరితో స్నేహపూర్వక సంబంధం కలిగిఉండుట మంచిదే కాని వారితో సహవాసం మిమ్మల్ని దేవునికి దూరం చేస్తుందా? ఆలోచించాలి. వారితో దేవుని విషయాలు కాక లోకాను సారమైన మాటలు మాట్లాడుతున్నారా? వారిని సంతోషపెట్టే క్రమంలో మీకు తెలియకుండానే దేవునికి దూరమౌతారు. "లోక(లోకస్తులతో) స్నేహము దేవునితో వైరము" అని మనం గుర్తుపెట్టుకోవాలి. మన సహవాసము మనలను దేవునికి దగ్గరగా చేర్చునదై ఉండాలి.

*"మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారు డైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది" 1యోహాను 1:3*

**నిరీక్షణ గలది:** ఆ కాలంలో ఉన్న యూదులు వారి ఆచార వ్యవహారా లు, స్వనీతి, కొంత మనకు బైబిల్లో కనిపిస్తుంది. కానీ అవేవి అన్నను, ఆమె నిరీక్షణను ప్రభావితం చేయలే దు. అందుకే ఆమె బాలయేసుని విమోచకుడని గుర్తించింది. దేవున్ని కొనియాడింది.

మరి నీ నిరీక్షణ ఏమిటి? నీ శ్రమలు బాధలు కష్టాలు దేవుడు చూస్తున్నాడు, తగిన సమయమందు ఆయన పూనుకొని నీకు విమోచన/ విడుదల కలుగజేస్తాడను నిరీక్షణ తో నీవు జీవిస్తున్నావా? దేవుని యందు నిరీక్షణ కలిగిన వారు ప్రత్యేకంగా ఉంటారు. లోకము వారిని ప్రభావితం చేయలేదు. అయువంటి జీవితం నీకున్నదా?

అన్న వలె ప్రతి క్రైస్తవురాలు లోకమునకు వేరై, దేవుని యందు భయభక్తులు, సంఘములో కుటుంబములో మంచి సాక్ష్యము కలిగి, దేవునియందు నిరీక్షణతో జీవించాలి. అట్టి కృపను దేవుడు మనకందరికి దయచేయును గాక!

# దేవుని కొరకు జీవించుట

దేవుడు, సామాన్యమైన మనుష్యుల ద్వారా అసాధారణ కార్యములు చేయించుకుంటాడు. బైబిలులో విద్యలేని పామరులతో కూడ గొప్ప కార్యాలు చేయించుట చాలా సందర్భాలలో చూస్తాము. 2రాజులు 5వ అధ్యాయంలో వ్రాయబడిన ఒక పేరు లేని బానిసను మీ యొక్క దృష్టికి తేవాలనుకుంటున్నాను. 5:2లో ఇలా వ్రాయబడింది. "సిరియనులు గుంపుగుంపులుగా బయలు దేరి ఇశ్రాయేలు దేశము మీదికి పోయి ఉండిరి. వారచ్చట నుండి యొక చిన్నదాని చెరగొని తేగా, అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను".

ఈ పేరులేని చిన్న బాలికను దేవుడు గొప్ప విధముగా వాడుకున్నాడు. సిరియా దేశపు యజమానురాలి దగ్గర పని చేస్తున్నా, తన దేవుడిని, తన స్వంత దేశమును, తన ప్రజలను ఏనాడూ మరువలేదు. తన యజమానురాలి ప్రేమకు పాత్రురాలైందంటే ఎంత నమ్మకంగా చక్కగా పని చేసి ఉంటుందో గ్రహించగలం. తన పరిస్థితినిబట్టి క్రుంగిపోకుండా ఆ పరిస్థితుల్లోనే తృప్తిగా, సంతోషంగా, బాధ్యతగా ఉంది. తను పూజించే ఇశ్రాయేలు దేవుడు తనను విడువడు ఎడబాయడు అనే విశ్వాసం మెండుగా ఉన్నందువల్ల సంతోషంగా ఉండి తన యజమానురాలి అభిమానం చూరగొంది.

ఈ చిన్న దాసి నయమాను అనే సిరియా రాజు సైన్యాధిపతి యొక్క భార్య దగ్గర పనికి నియమింపబడింది. దేవుని ప్రణాళికలో –ఈ నయమాను ఉన్నాడన్న సంగతి మొదటి వచనంలో కనబడుతుంది. 'అతని చేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగుచేసి యుండెను' అనే వాక్యంలో మనకు దేవుడు నయమానును ఏదో ఒక విషయంలో వినియోగించుకుంటాడు అనే సంగతి తెలుస్తుంది. ఈ చిన్న బాలిక ద్వారా ఎలీషా ప్రవక్తను నయమానుకు పరిచయం చేయాలని దేవుని ఆలోచనగా ఉంది.

3వ వచనంలో 'షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గర నా యేలిన వాడుండవలెనని నేనెంతో కోరుచున్నాను; అతడు నా యేలిన వానికి కలిగిన కుష్ఠరోగమును బాగు చేయునని తన యజమానురాలితో అనెను'. ఈ వచనం ధ్యానం చేసినపుడు ఈ బానిసలో ఉండే చాలా లక్షణాలు మనకు స్పష్టమవుతున్నాయి. మొదటిగా ఆ అమ్మాయి ధైర్యం కనబడుతుంది. బానిసగా పరాయి దేశానికి చెరపట్టబడి తేబడిన అమ్మాయిలో చాలా దీనత్వం, భయం కనబడాలి. కాని ఇది చాలా ధైర్యవంతమైన ప్రతిపాదన. ఇలాటి సలహా ద్వారా పెద్ద శిక్షకు గురయ్యే అవకాశం ఉంది. అయితే నిజమైన స్వస్థతా మూలం ఎక్కడుందో ఆమెకు తెలుసు. నయమాను క్షేమం నిమిత్తం ఆమెకున్న గాఢమైన శ్రద్ధను బట్టి ఆమె ధైర్యంగా తనకేమైనా పర్వాలేదని అనుకొని ఆ మూలం వద్దకు, అంటే ఏకైక నిజదేవుని చెంతకు తన యజమానిని నడిపించింది. అలా చెప్పడంలో ఈ చిన్నది అచంచలమైన విశ్వాసం చూపించింది. సాధారణంగా మనము ఒకచోట ఉన్నప్పుడు, అక్కడ నుండి మనమేమి పొందగలమా అని ఆలోచిస్తూ ఉంటాము. కాని ఈ చిన్నది తను వాళ్ళకు ఏ విధంగా సాయం చేయగలనా అని ఆలోచిస్తుంది. తనకుండే మిడిమిడి జ్ఞానాన్ని ఇతరులకు ఉపయోగపడేటట్లు చేసింది.

ఈ చిన్నపిల్ల ఎంతో ఘనతగల తన యజమానికి సంపూర్ణ ఆరోగ్యం కూడా ఉండాలని కోరుకుంది. తన దేవుని మీద, తన దేశ ప్రవక్త మీద పూర్ణ విశ్వాసముంది కాబట్టి తన యజమాని తప్పక స్వస్థత పొందుతాడు అని తెలుసుకుంది. తన యజమాని ఆరోగ్యం కొరకు భారంతో ప్రార్థించి ఉంటుంది. ఆ అమ్మాయిలో ఒక బాధ్యతగల దేవుని బిడ్డ మనకు కనిపిస్తుంది. దేవుడు ఆ అమ్మాయికి తన యజమానురాలిని, ఆమె ద్వారా తన యజమానుని, ఆ దేశపు రాజును కూడా ఒప్పించగల జ్ఞానమును దేవుడు ఇచ్చాడు.

నయమాను ఆ చిన్న దాసి చెప్పిన సంగతి రాజుకు చెప్పగా సిరియా రాజు ఇశ్రాయేలు రాజునకు దూత చేత

పత్రికను, విలువైన బహుమానములను పంపినాడు. 'నా సేవకుడైన నయమానునకు కలిగిన కుష్ఠరోగమును నీవు బాగు చేయవలెను' అనునది ఆ పత్రిక సారాంశం. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఇశ్రాయేలు రాజుకు తన రాజ్యంలో ఉన్న ఎలీషా ప్రవక్త చాలా దైవజ్ఞానం కలిగి అద్భుతాలు చేయు శక్తి గలవాడని తెలీదు. ఒక చిన్న బాలికకు ఆయన సంగతి అర్థమయింది కాని రాజుకు అర్థము కాలేదు. ఆ రాజుకు ఏమి చేయాలో తోచక తన గుడ్డలు చింపుకున్నాడు. ఈ వార్త విన్న ఎలీషా ప్రవక్త నయమానును తన దగ్గరికి పంపమని రాజుకు వర్తమానము పంపాడు. తర్వాత నయమానును ఏడుసార్లు యొర్దాను నదిలో మునగమని ప్రవక్త చెప్పడమూ, ముందు ఒప్పుకోక పోయినా తర్వాత ఒప్పుకొని మునిగి స్వస్థత పొందడమూ జరిగింది. ఈ స్వస్థతవల్ల చాలా గొప్ప కార్యాలను దేవుడు జరిగించాడు.

ఒక అన్యుడైన నయమానుకు దేవుని దయవల్ల స్వస్థ పరచబడి దేవుని యెడలను ప్రవక్త యెడలను కృతజ్ఞత కలుగుతుంది. తన్ను తాను తగ్గించుకొని ఎలీషా దగ్గరకి కానుకలను తీసుకొని వస్తాడు. కానీ ఎలీషా కానుకలను స్వీకరించ లేదు. నయమానుకు జీవముగల దేవుని గురించి ఒక గొప్ప సత్యం తెలుపబడింది. ఎలీషా దగ్గరకు వెళ్ళినప్పుడు గర్విష్టిగా, సిరియా రాజు యొక్క రాయబారిగా వచ్చి, తిరిగి వెళ్ళినప్పుడు దీనహృదయంతో సిరియా రాజుకు, ప్రజలకు నిజదేవుని గురించి ప్రకటించుటకు నిజదేవుని రాయబారిగా వెళ్తున్నాడు. నయమాను మొట్టమొదటిగా ఇశ్రాయేలుకు వెళ్ళడానికి ఒప్పుకోవడమే గొప్ప విషయం. ఎందుకంటే అది తన స్వంత దేవుళ్ళకు విముఖత చూపడమే. ఇందువల్ల తన స్వజాతీయుల విమర్శలకు గురి కావడం, తన దేశపు సైనిక వ్యవస్థను ఆపదలోకి నెట్టినట్లు అయింది. కాని స్వస్థతనొంది నిజదేవుని తెలుసుకున్న తర్వాత తన స్వజనులను గూర్చి తలంచలేదు. నయమాను ఎలీషాకు ఈ విధంగా చెప్పాడు 'చిత్తగించుము ఇశ్రాయేలులోనున్న దేవుడు తప్ప లోకమంతటి యందును మరియొక దేవుడు లేడని నేను ఎరుగుదును' మరియు 'యెహోవాకు తప్ప దహనబలినైనను మరి యే బలినైనను ఇతరమైన దేవతలకు నేనికను అర్పింపను' అని తన దేశములో బలిపీఠము కట్టించుకొనుటకు మన్ను కూడా మోసికొని పోయాడు.

అన్యుడైన ఈ సిరియా దేశపు సేనాధిపతిలో ఈ గొప్ప కార్యాలు ఒక పేరులేని బానిస ద్వారా ప్రభువు జరిగించాడు. ఆ చిన్నది తను స్వంతంగా స్వస్థత కలిగించలేక పోయినా ప్రార్థనల ద్వారా స్వస్థత కలిగించే వారి యొద్దకు తన యజమానుని పంపించ గలిగింది. మనలో చాలామంది సువార్త ప్రకటించుటకు బిడియపడుతూ ఉంటారు. కనీసం దైవజనుల దగ్గరకి ఆశగల ప్రాణులను నడిపించ గలిగితే పరోక్షంగా మనం కూడా దైవకార్యములు చేసిన వారమౌతాము. ఈ చిన్నదానివలె, మనం కూడా మన జీవితాలను దేవుని కర్పించి మన కుటుంబాలనూ, బంధు మిత్రులనూ నిరీక్షణ, స్వస్థత, రక్షణ ఇచ్చే నిజదేవుని దగ్గరకు నడిపిద్దాం. సంతోషంగా దేవునికి మనలను మనం అప్పగించుకొని దేవుడిచ్చు సకల ఆశీర్వాదములు పొందుకుందాం. దేవుడు మిమ్ములను దీవించును గాక! ఆమేన్.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

## దేవుడు చేసిన మేలులు

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

సాక్ష్యము

# మరువని దేవుడు

అది 1963వ సంవత్సరం ఆగష్టునెల 27వ తేదీ సోమవారం ఉదయం, సమయం సుమారు ఎనిమిది గంటలు కావస్తుంది. మా తండ్రిగారైన బి.యం.సమూయేలు గారు మరణంతో పోరాడుచున్నాడు. ఆదివారం రాత్రంతా ఆయన పరిస్థితి అదే! కంబం గవర్నమెంటు ఆస్పత్రి డాక్టరు జేమ్సుగారు, పాపాయిపల్లె వాసులు డా॥ చల్లగాలి పాల్‌గారు, బేస్తవారిపేట వాస్తవ్యులు డా॥ ఫ్రాన్సిస్ కుమార్ గారు–ఈ ముగ్గురు రాత్రంతా చాలాసేపటి వరకు ఆయనకు పరిచర్య చేస్తూనే ఉన్నారు. రాత్రి 2 గంటలకు డా॥జేమ్సు గారు వెళ్తూ పెద్దలను కొందరిని పిలిచి "నమ్మకం లేదు. అయినా జాగ్రత్తగా కనిపెట్టి ఉండండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ మాట విన్నప్పటి నుండి మా తల్లిగారి దుఃఖాన్ని ఆపటం ఎవ్వరి వల్ల కాలేదు. రేపటి నుండి నాకు తండ్రి ఉండదు కదా! అనే భావన నన్ను మరీ కృంగదీసింది.

మా నాన్నగారు నా చేతిని ఆయన చేతిలోనికి తీసుకొని గట్టిగా పట్టుకొని 'బాబు, నేను చనిపోతున్నానని బాధపడ వద్దు. ఎందుకంటే పుట్టిన ప్రతివాడు తప్పక చావవలసిందే. ఈ మరణమన్నది తాత్కాలిక ఎడబాటు మాత్రమే! శాశ్వతం కాదు. ఎంత పెద్ద వాక్యాన్నైనా సరే ఒక చిన్నచుక్క (ఫుల్‌స్టాప్) తాత్కాలికంగా కొంతసేపు ఆపగలదేమో కానీ, శాశ్వితంగా ఆ వాక్యాన్ని నిలువరించలేదు. అంతేకాదు, అంతపెద్ద వాక్యాన్ని తాత్కాలికంగా నిలుపగలిగిన ఆ చిన్న చుక్కే అంతే పెద్దదైన లేక అంతకంటే పెద్దదైన మరియొక వాక్యాన్ని ప్రారంభించటానికి నాంది పలుకుతుంది. అంతేకాని పూర్తిగా నిలుపుదల చేయలేదు. అలాగే తల్లిదండ్రులమైన మేము నీకంటే ముందుగా పిలువబడి పరమతండ్రి సన్నిధికి చేరవలసి వస్తే, ముందుగా నేను చెప్పినట్లు మా చావు మరియొక గొప్ప ఆదరణకు నాంది కావొచ్చు. అలాగే ఈ రోజు నేను చని పోయినంత మాత్రాన నా చావు మిమ్మల్ని తండ్రి లేని వారిగా చేయలేదు సరికదా, నా కంటే శ్రేష్ఠుడు సర్వాధికారియైన పరలోకపు తండ్రి మీకు తండ్రిగా ఉంటూ మీ సమస్త అక్కర్లను తీరుస్తాడు"అంటూ ఇంకా ఏదో చెప్పా లని ప్రయత్నిస్తూనే కన్నుమూశాడు.అవే నాకు చివరి మాట లు. ఆ తర్వాత నా తండ్రి స్వరం వినే భాగ్యం నాకు కలుగ లేదు.

నా తండ్రి జీవించినంతకాలం నేను చిన్నవాడినే. నాకు ఊహ తెలిసినప్పటినుండి నాకు ఒక పేరు ఉన్నప్పటికీ (అది కూడా ఆయన పెట్టిన పేరే) 'బాబు' అని మాత్రమే పిలిచేవారు. ఏనాడు పేరు పెట్టి పిలువలేదు. పెద్దవాడనై బేస్తవారిపేట గ్రామంలో ఉన్న ఎ.బి.యం. టీచర్సు ట్రైనింగు స్కూల్లో ఉద్యోగం చేస్తున్నప్పటికి నేను ఆయనకు బాబునే. నాకు నేను దొరబాబునే అంతే. అది ఒక దర్పం. కానీ, ప్రతి మానవునికి జీవితంలో తప్పక ఒక చీకటి దినం ఉంటుందని, నా జీవితంలో కూడా ఒక చీకటిదినం రానే వచ్చింది. అదే నేను నా తండ్రిని పోగొట్టుకున్న దినం. అదే నా దొరబాబు తనం మసిబారిన దినం. తండ్రిని పోగొట్టుకునే రోజుకు జీవితమంటే ఏమిటో పూర్తిగా తెలి యదు. అప్పుడప్పుడే జీవితంలోకి తొంగి చూస్తూ జీవితపు ఓనమాలు దిద్దుకుంటున్న రోజులవి. అనుకోకుండా ఒక ఉపద్రవం వచ్చిపడింది. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు రాష్ట్రంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరిగిపోతూ ఉంది. వీరందరికి ఉద్యోగాలు కల్పించటం అసాధ్యం. కనుక ట్రైనింగ్ స్కూళ్ళను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయించుకుంది. దాని ఫలితంగా ప్రకాశం జిల్లా బేస్తవారిపేట గ్రామంలో ఎ.బి.యం. టీచర్సు ట్రైనింగు స్కూల్లో పనిచేస్తున్న నేను గుంటూరు జిల్లా బాపట్లలోని ఎ.బి.యం. ఉన్నత పాఠశాలకు బదిలీ చేయబడినాను. మా తండ్రిగారు ఇక్కడి గ్రామీణ ప్రాంతాలలో సువార్తికునిగా ఉన్నందున మేము ఆర్థికంగా చాలా బలహీనులం. అందువలన బాపట్లకు వెళ్తూ ఒక చెక్క పెట్టె, ఒక నులకమంచం, చిన్న ట్రంకుపెట్టె, వంటసామానులు ఉన్న ఒక గోనెసంచి మాత్రమే తీసుకొని వెళ్ళాను. అదే నా

ఆస్థి. ఈ సామాన్లతో పాటు నేను, నా భార్య, ఇద్దరు పిల్లలను తీసుకొని మా తల్లిగారు ఇచ్చిన ముప్పై రూపాయలతో బాపట్ల చేరాను. అప్పుడు బాపట్ల హెడ్మాస్టరు గారైన శ్రీ. పి. ఆశీర్వాదం గారి దగ్గరకు వెళ్తే 'హయ్యర్ గ్రేడ్ హాస్టల్లో రూములు అన్నీ ఖాళీగా ఉన్నాయి. నీకు ఇష్టమైతే ఒక రూములో ఉండు' అన్నారు. అలాగే ఒక రూములో చేరి క్రొత్త ఊళ్ళో నూతన సంసారం ప్రారంభించాను. ఆ ఊళ్ళో మొట్టమొదటగా మమ్ములను చూచి పలకరించి మాకు తగిన పరిచర్యలు చేసిన యువకుడు శ్రీ.యం.జాకబ్‌గారు. (ప్రస్తుతం ఆయన బాపట్లలో లాయరుగా ప్రాక్టీసు చేస్తున్నారు). ఆయనతో పాటు వారి అన్నగారైన శ్రీ యం.జి. సుందరరావుగారు, వారి కుటుంబం బాపట్లలో మమ్ములను ఆదరించిన వారిలో ముఖ్యులు. వారిని మేము ఎప్పుడు మరచిపోలేము. ఆ రాత్రి హాస్టలు గదిలోనే నిద్రించాము. బాపట్ల చేరేసరికి మా అమ్మగారు ఇచ్చిన ముప్పై రూపాయలలో ఛార్జీలకు, దారి ఖర్చులకు పోను ఇక మిగిలినది కేవలం పన్నెండు రూపాయలు మాత్రమే! పైకి గంభీరంగా కన్పిస్తూ ఉన్నా, పరిచయస్తులెవ్వరూ లేని ఊళ్ళో నెల రోజులు ఎలా జీవించాలి? నెల గడిస్తే కానీ మళ్ళీ జీతం రాదు. అప్పటి వరకు జీవించటం ఎలా? అనే సమస్య మాత్రం నన్ను పీడిస్తూనే ఉంది. ఇక నా భార్య పరిస్థితి చూస్తే ఆమె ముఖము నిండా దిగులు, గుండెల నిండా దాచుకోవాలన్నా దాచుకోలేని బాధ. మనస్సులో అనేక ప్రశ్నలు. చివరకు ఆపుకోలేక 'ఈ పన్నెండు రూపాయలతో ఎలాగండీ నెలంతా జీవించటం?' అంటూ నా వైపు చూచింది. 'ఎలా జీవించాలని ఇంత దూరం వచ్చాము?' అంటూ మౌనంగా రోదిస్తూ కూర్చుండిపోయింది. ఆ మొదటి రాత్రి అలా గడిచిపోయింది.

ఉదయాన్నే పిల్లలకు తినటానికి ఏదైనా తెద్దామని చీలు రోడ్డులో ఉండే పాకలాంటి హోటలుకు వెళ్ళాను. హోటలు యజమానిని 'పిలిచి ఇడ్లీ ఎంతండీ?' అని అడిగాను. "పదిపైసలు" జవాబు. ఇరుకులో విశాలతవలె ఆ జవాబు నాకు చాలా సంతృప్తి నిచ్చింది. ఒక రూపాయి ఇడ్లీలు తీసుకొని ప్రక్కనే ఉన్న కాంతారావు కొట్లో బియ్యం, ఉప్పు, పప్పు లాంటివి కొద్దికొద్దిగా తీసుకొని వెళ్ళి ఇంట్లో ఇచ్చాను. ఇక మిగిలింది ఐదు రూపాయలు మాత్రమే! పదిగంటలకు స్కూలుకు వెళ్ళి స్కూల్లో జాయిన్ అయ్యాను. అందరు ఆప్యాయంగా పలుకరించారు. స్కూలుకైతే వెళ్ళానే గాని మనసంతా అల్లకల్లోలంగా ఉంది. ఏవేవో ఆలోచనలు. చివరికి సాయంకాలం హెడ్మాస్టరుగారిని అడిగి జీతం వస్తే తిరిగి ఇస్తానని చెప్పి యాభై రూపాయలు చేబదులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పటికి నా మనసు కొంత నెమ్మదించింది. నేను అలా ఆలోచిస్తూ ఉండగానే మా స్కూల్లో పని చేస్తున్న శ్రీ యం. ధర్మదాసు వచ్చి 'మాస్టరుగారు, మిమ్మల్ని హెడ్మాస్టరుగారు పిలుస్తున్నా రండీ!' అని చెప్పాడు. వెదకబోయిన తీగ ఎదురు వచ్చినట్లు హెడ్మాస్టరుగారే పిలుస్తున్నారు అనుకుంటూ వెంటనే ఆయన గదికి వెళ్ళాను.

హెడ్మాస్టరు గారు నన్ను చూడగానే 'మాస్టరు గారు! మీ ట్రావెల్‌బిల్ ఎంతో రాసి ఇస్తే డబ్బులు ఇస్తాను' అన్నారు. 'సరే!' అని చెప్పి స్టాఫ్‌రూంలోకి వెళ్ళి కూర్చున్నాను. ట్రావెల్ బిల్లు అంటే ఏంటో తెలియదు. ఏమి వ్రాయాలో తెలియదు. ఆలోచించి ఆలోచించి సరే! మనకు ప్రయాణంలో అయిన ఖర్చు ఎంత అయితే అంత వ్రాసి ఇస్తే సరిపోతుంది కదా! అని నిర్ణయించుకొని, ప్రయాణంలో అయిన ఖర్చు 18రూ. అలాగే వ్రాసి హెడ్మాస్టరుగారికి ఇచ్చాను. ఆ బిల్లు చూచిన హెడ్మాస్టరుగారు వెంటనే ఆ స్కూల్లో రైటరుగా పనిచేస్తూ ఉన్న శ్రీ కళ్యాణం రాధాకృష్ణ మూర్తి గారిని పిలిచి 'మాస్టరు గారు ట్రావెల్‌బిల్ ఇచ్చారు, చూడండీ!' అంటూ నేను ఇచ్చిన బిల్లును ఆయనకు చూపించారు. రాధాకృష్ణమూర్తిగారు నేను వ్రాసి ఇచ్చిన బిల్లును చూచి చిన్నగా నవ్వి, హెడ్మాస్టరు గారితో ఏదో మాట్లాడిన తరువాత ఆయనే ఒక బిల్లు తయారు చేసి రెవెన్యూస్టాంపు అతికించి ఆ స్టాంపు పైన సంతకం చేయమని నాకు ఇచ్చారు. ఆ బిల్లును చూడగానే ముందుగా అదిరి పోయాను. ఆ బిల్లు మొత్తం 500 రూ. లారీ బాడుగ, సామాన్లు ఎత్తుటకు, దించుటకు కూలీ ఛార్జీలు, ప్రయాణపు ఖర్చులు వెరసి 500రూ. ఆ బిల్లుపై సంతకం చేసి ఇస్తే హెడ్మాస్టరు గారు 500రూ నా చేతిలో ఉంచారు.

నిజానికి అప్పుడు అంటే 1971వ సంవత్సరంలో నా జీతం బేసిక్146రూ. డి.ఎ.104రూ. మొత్తం 250రూ.

మాత్రమే! కానీ ప్రస్తుతం నేను తీసుకుంటున్న బిల్లు 500రూ. అంటే రెండు నెలల జీతం అన్నమాట. పరిచయస్తులు ఎవ్వరు లేని క్రొత్త ఊరిలో ఎలా జీవించాలి? అని గత రాత్రంతా నేను, నా భార్య పడిన వేదనలకు ప్రతిఫలంగా ప్రభువు మాకు ఈ విధంగా మార్గం తెరిచాడు. ఇంటికి వెళ్ళి నా భార్యకు ఆ డబ్బును చూపించినపుడు ఆమె ముఖంలో గోచరిస్తున్నది ఆనందమా? ఆశ్చర్యమా? నేను ఊహించలేకపోతున్నాను. విషయమంతా ఆమెకు చెబుతుండగానే ఆమె కళ్ళ వెంట కన్నీరు ధారలైపోతుంటే నా కళ్ళు కూడా చెమ్మగిల్లినవి. వెంటనే ఇద్దరం మోకరించి కన్నీటితో ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించిన పిమ్మట ఎప్పుడైతే మా కన్నీరు కారిందో అప్పుడు కాని ఈ దీనుడికి ప్రభువు మాటలు గుర్తుకురాలేదు. 'ఇదిగో, నేను నీకు తోడైయుండి, నీవు వెళ్ళు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచు నేను నీతో చెప్పినది నెరవేర్చు వరకు నిన్ను విడువను' (ఆది. 28:15) అని మన ప్రభువు యాకోబుతో చెప్పిన మాటలు అక్షరాల నా పక్షముగా నెరవేరినవి అని అప్పుడుగాని గ్రహించలేకపోయాను. అలాగే మా తండ్రిగారు మరణిస్తూ 'నేను చనిపోయినంత మాత్రాన నా చావు మిమ్మల్ని తండ్రి లేని వానిగా చేయలేదు సరికదా, నా కంటే శ్రేష్టుడు, సర్వాధి కారియైన పరలోకపు తండ్రి మీకు తండ్రిగా ఉంటూ మీ సమస్త అక్కరలను తీరుస్తాడు' అన్న మాటలు నా నిజ జీవితములో ఎలా ప్రతిక్షేపించబడి ఋజువయ్యాయో స్వత హాగా అనుభవించి గ్రహించిన తరువాత, నిశ్చయంగా దేవుడు మనల్ని ఎన్నడు మరచిపోడు అని నిర్ధారించుకుని ఆ దేవ దేవునికి సాక్షిగా బ్రతుకుచున్నాను.

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 6 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మా | 2 రు | తా | 3 రు | ■ | 4 రా | తి | 5 వే | 6 త |
| 7 రా | మా | ■ | 8 గ | ల | జ | ■ | 9 డు | మో |
| ■ | 10 లు | 11 గ | న | ■ | 12 గు | 13 డు | క | ■ |
| 14 గ | ■ | మం | ■ | 15 తా | ■ | ప | ■ | 16 తి |
| 17 వి | యే | క | న్నీ | సు | ళ్ళు | డి | చె | ను |
| ని | ■ | త్తి | ■ | తా | ■ | భ | ■ | ము |
| ■ | 18 సో | లి | 19 పో | ■ | 20 క | య | 21 ప | ■ |
| 22 గ | మ | ■ | 23 కి | సి | వి | ■ | 24 న | 25 ర |
| 26 తి | రి | గి | రి | ■ | 27 లె | మూ | లు | యే |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 6**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. డి. సురేష్ కుమార్, వెంపడం, విజయనగరం
4. జి.యస్.యస్. ప్రసాద్, వైజాగ్
5. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
6. టి. సుదర్శన్, నంద్యాల
7. కె. లలితాబాయి, వైజాగ్
8. వి. రత్నమ్మ, హైదరాబాద్
9. బి. ఆనీమేరి, హైదరాబాద్

**'హన్నాకృప'** పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలు కరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నడుపగలుగుతున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 350/– రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయంతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **– ఎడిటర్**

చిన్నపిల్లల పేజి

# నీతో ఉండే దేవుడు

స్కూల్ నుండి దిగాలుగా వచ్చిన దేవిడ్‌కు క్రొత్త స్కూల్ అంతగా నచ్చలేదని అర్థమైంది తల్లికి. కేంద్రీయ విద్యాలయ అంటే మంచి స్కూల్ అని, తండ్రి లేని దేవిడ్ భవిష్యత్తు బాగుంటుందని చెప్పిన హెడ్‌మాష్టరు గారి మాటమీద గౌరవంతో క్రొత్త స్కూల్లో జాయిన్ చేసింది. మొదట్లో కాస్త ఇబ్బంది పడినా చిన్నచిన్నగా అలవాటౌతుందిలే అనుకుంది. కానీ రోజులు గడిచే కొద్ది దేవిడ్ ముఖం చూస్తే స్కూల్ మార్చి తప్పు చేశానా అనే అనుమానం కలగసాగింది తల్లికి. ఆఫీసు పనులతో, ఇంట్లో పనులతో బిజీగా ఉన్న తల్లి ఆదివారం దేవిడ్‌తో మాట్లాడాలి అని నిశ్చయించుకుంది.

క్రొత్త స్కూల్ నచ్చలేదా?స్కూల్‌లో ఏదైనా సమస్య? ఈ మధ్య దల్‌గా ఉంటున్నావు ఏమైంది దేవి? అడిగింది తల్లి. దేవిడ్ మౌనంగా ఉన్నాడు. నీ ప్రాబ్లెం ఏంటో చెప్పకపోతే నేను నీకు ఎలా హెల్ప్ చేయగలను చెప్పు? అంటూ బ్రతిమాలింది.

ఇష్టంగానే ఈ స్కూల్లో జాయిన్ అయ్యాను కానీ మా క్లాస్‌లో విక్కి నన్ను సతాయిస్తున్నాడు మమ్మీ. వాళ్ళ తమ్మునికి రావాలసిన సీటు నేను కొట్టేశానని వాడి ఫీలింగ్. విక్కీ వాళ్ళ తమ్మునికి నాకు ప్రవేశపరీక్షలో ఒకే మార్కులు వచ్చాయి. సింగిల్ పేరంట్ కోటాలో నాకు సీటు వచ్చింది అందుకని నేనంటే విక్కీకి కోపం. అందుకే వాడు నన్ను సింగిల్ పేరంట్ సన్ అని పిలుస్తూ ఏడిపిస్తున్నాడు మమ్మీ అన్నాడు దేవిడ్ చిన్నగా.

ఆ మాటలు విన్న తల్లికి ఏమి చెప్పాలో అర్థం కాలేదు. ఏడేళ్ళక్రితం హఠాత్తుగా తన భర్త మరణవార్తను విన్న సన్నివేశం తన కళ్ళముందు కదిలి కన్నీళ్ళు ధారగా కారాయి. మమ్మీ మమ్మీ సారీ మమ్మీ... ఏడ్వకు, నువ్వు ఇలా బాధపడతావనే నేను నీకు చెప్పలేదు సారీ మమ్మీ అంటూ ఏడుస్తున్న దేవిడ్ మాటలతో ఈ లోకంలోకి వచ్చింది నాన్సీ. చిన్నగా తనను తాను సంభాళించుకొని కొడుకు కన్నీరు తుడుస్తూ, దేవిడ్ డాడీ లేరని మనకు బాధ కలిగినప్పటికి డాడీ కంటే గొప్పవాడైన దేవుడు మనతో ఉన్నాడు. డాడీ చేయాల్సిన పనులు నేను చేస్తున్నప్పటికి, బాధ్యత దేవునిదే. మీ డాడీ ఉంటే ఆయన ఈ స్కూల్‌లో నీ సీటు గురించి, ఆలోచించేవారేమో. నాకేమి తెలియకున్న దేవుడు నీకు మంచి స్కూల్‌లో సీటు ఇచ్చాడు. డాడీ లేరు కాబట్టి యేసయ్యే నిన్ను ఈ స్కూల్లో జాయిన్ చేశారు కదా! అంటే అప్పుడు నీకు డాడీ ఎవరు అంది దేవిడ్ నుండి సమాధానం ఆశిస్తున్నట్లుగా. ఒక్కసారిగా దేవిడ్ ముఖం వెలిగిపోయింది యేసయ్య అన్నాడు దేవిడ్ సంతోషంగా.నాన్సీ మనసు కుదుటపడింది. చూడు దేవిడ్, మనం దేవున్ని బట్టి ధైర్యంగా ఉండాలి ఇంకెప్పుడు డాడీ లేరని ఫీల్ అవ్వకూడదు అంది తల్లి.

మరునాడు స్కూల్లో విక్కీ మాటలు పట్టించుకోకుండా ధైర్యంగా ఉన్నాడు దేవిడ్. దేవిడ్ ముఖంలో కోపం కాని, దిగులు కాని కనిపించకపోవడంతో విక్కీకి ఆశ్చర్యమేసింది. నాలుగు రోజులు దేవిడ్‌ను గమనించిన విక్కి దేవిడ్‌తో ఏంట్రా ఏమన్నా పట్టించుకోవడంలేదు. నేను అంటున్నది నిన్నే. ఈ స్కూల్లో తండ్రి లేనివాడివి నువ్వొక్కడివే అన్నాడు వెటకారంగా. దేవిడ్ మనసులో ధైర్యంగా నాకు నాన్న ఉన్నాడు. యేసయ్యే నాకు తండ్రి అన్నాడు అమాయకంగా. దేవిడ్ మాటలు విన్న విక్కి, అతని స్నేహితులు పగలబడి నవ్వుతూ, ఏంటమ్మా యేసయ్య నీ నాన్న? మా చెవులో పువ్వులేమైనా కనబడుతున్నాయా నీకు? అని హేళనగా మాట్లాడుతూ నవ్వసాగారు. దేవిడ్‌కి కొంత ఇబ్బందిగా అనిపించినా తన తల్లి చెప్పిన మాటలనుబట్టి ధైర్యంగా అవును, దేవుడే నాకు తండ్రి అన్నాడు గట్టిగా. అవునా, అలా అయితే రేపు నేను మా డాడీని తీసుకు వస్తాను, నువ్వు మీ డాడీని అదే యేసయ్యను తీసుకు రా. డాడీ లేకుండా స్కూల్‌కి రాకూడదు. ఎవరైతే స్కూల్‌కి రారో వారు ఓడిపోయినట్టు. ఓడిపోయినవాళ్ళు ఎప్పటికి సింగిల్ పేరంట్‌గాళ్ళే అన్నాడు విక్కి వెటకారంగా నవ్వుతూ.

రేపు యేసయ్యను స్కూల్‌కి ఎలా తీసుకెళ్ళాలో అర్థం కాలేదు డేవిడ్‌కి. రాత్రి భోజన సమయంలో మమ్మీ దేవుడు మనతో ఉన్నాడని మనకెలా తెలుస్తుంది? అని అడిగాడు డేవిడ్ తల్లిని. నీకు దావీదు గొల్యాతుల కథ తెలుసా అడిగింది తల్లి. తెలుసు మమ్మీ బలాఢ్యుడైన గొల్యాతు యుద్ధా నికి రాగా సౌలు రాజు, ఇశ్రాయేలు ప్రజలు అందరూ భయపడినప్పటికి చిన్నవాడైన దావీదు వడిసెల రాయితో గొల్యాతును పడగొట్టి చంపి గెలిచాడు అన్నాడు. ఇశ్రాయేలు ప్రజలు, సౌలు రాజు అందరూ భయపడితే దావీదు మాత్రం భయపడక గొల్యాతు మీద యుద్ధానికి వెళ్ళడానికి కారణం ఏంటో తెలుసా? దేవుడు. దేవుడే దావీదు ధైర్యం. కేవలం దేవుడు దావీదుతో ఉండటం వలననే దావీదు అంత పెద్ద గొల్యాతును జయించాడు. మనం దేవున్ని బట్టి ధైర్యంగా ఉంటే దావీదుకు తోడైయున్న దేవుడు మనకు తోడై ఉంటాడు. అప్పుడు గొల్యాతులాంటి ఏ సమస్య నైనా మనము కూడా జయిస్తాము అన్నది తల్లి. తల్లి ఇచ్చిన సమాధానం డేవిడ్‌కి అర్థమైనా తన సమస్యకు పూర్తి పరిష్కారం దొరకలేదు. పడుకునే ముందు మోకరించి యేసయ్య నువ్వే నాకు నాన్నవని నాకు తెలుసు. విక్కికి నిన్ను చూపించాలి. స్కూల్లో ఒకే ఒక్కసారి విక్కీకి కనిపించు అని ప్రార్థించాడు.

మరునాడు స్కూల్‌కి అయితే వెళ్ళాడు కానీ ఒక వైపు విక్కీ గురించి తలుచుకుంటే భయం వేస్తుంది. మరొక ప్రక్క దావీదుతో ఉన్న దేవుడు తనతో ఉంటాడని అమ్మ చెప్పిన మాటను తలుచుకుంటే ధైర్యం కలుగుతుంది. రోజంతా దేవున్ని తలుచుకుంటూనే ఉన్నాడు. విక్కీ కనపడలేదు. డేవిడ్‌కి ఆశ్చర్యం ఆనందం కలిగాయి. అలా నాలుగు రోజులు గడిచినా విక్కి స్కూల్లో కనపడలేదు. విక్కీ వాళ్ళ డాడీకి ఉద్యోగరిత్యా వేరే ఊరికి బదిలి అయి వెళ్ళిపోయారని తెలిసి ఆశ్చర్య పోయాడు డేవిడ్. జీవితంలో మరెన్నడు డేవిడ్ తనకు డాడీ లేరని ఫీలవ్వలేదు.

**ఫోన్‌పే / గూగుల్ పే నంబరు**

**9440217726**

**చందాదారుల వివరములు**

1. అపో. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
2. దాసరి శ్యామ్ హెయ్యర్ పాల్ – 2000 (ప్రతి నెల)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
5. ముద్ద సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
11. జి. కళావతి, ఒంగోలు 350/–
12. వి. కస్తూరి, భీమవరం 500/–
13. జయ, గుంటూరు – 1500/–
14. కె. రజిని, నరసరావుపేట – 1000/–

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

## పాఠకులకు గమనిక

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,
ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక
6వ లైను, క్లోపేట, ఒంగోలు–523001
ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726

# కృపాదానం

1948 ఫిబ్రవరిలో భీమవరపుకోట నుండి సామర్లకోట వచ్చిన కృపాదానం బాప్టిస్టు, లూథరన్ చర్చిలకి మధ్యలో, ఎత్తైన పీఠభూమి మీద మట్టి గోడ ప్రహరీగా ఉన్న ఇంట్లో చేరాడు. ఆ ఇంటికి ఎదురుగా ముస్లింల సమాధులు, వెనుక హిందూ దేవాలయం ఉండేవి. కొంత కాలానికి తమ ఇంటికి కొంచెం దూరంలో ఉన్న మార్తమ్మ అనే పెంతెకోస్తు స్త్రీతో సహవాసం కలిగింది. అందువలన కృపాదానం హన్నమ్మలు కొంతకాలం పెంతెకోస్తు సహవాసంలో ఉన్నారు. అయితే భాషలు మాట్లాడలేదు. మాట్లాడాలి అనుకోలేదు. దానియేలు అనే 22 సంవత్సరాల యువకుడు, అప్పుడప్పుడు ఇంటికి వచ్చి కుటుంబ ప్రార్థన పెట్టేవాడు. 13 సంవత్సరాల కృపాదానం పెద్ద కుమార్తె యేసు ప్రభువును అంగీకరించింది. అంతకుముందు మంచి క్రైస్తవులుగా ఉన్న కృపాదానంకు మారుమనస్సు, రక్షణ అనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కృపాదానం గారికి అప్పటికి దాదాపు 14 సంవత్సరాల నుండి ముక్కుపొడి పీల్చే అలవాటు ఉండేది. హన్నమ్మగారు ఆ అలవాటు మాన్పించాలని చాలా కష్టపడింది. కాని కుదర్లేదు. దానియేలు గారి సహవాసంలో ఉన్న రోజుల్లోనే కృపాదానం ముక్కుపొడి పీల్చడం మాని వేశాడు. ఇన్సూరెన్సు ఉద్యోగం పెద్ద ఆశాజనకంగా లేదు. తెనాలి దగ్గర పినపాడు గ్రామములో రోమన్ క్యాథలిక్కు వారి స్కూలులో తన భార్యకు టీచర్ ఉద్యోగం దొరికింది. అందువలన కుటుంబంతో పినపాడు గ్రామమునకు వచ్చాడు. ఒక్క జీతముతో ఇల్లు గడవాలి. నలుగురు మగ పిల్లలు, నలుగురు ఆడపిల్లలు. కృపాదానం హృదయంలో సేవ చెయ్యాలి, దేవుని పని చెయ్యాలి అనే ఆశ మాత్రం బలంగా ఉన్నది. భార్య హన్నమ్మ కూడా అదే ఆలోచనలోను ఆశలోను ఉండినది.

ఒకరోజు దంపతులిద్దరు విజయవాడలోని ఒక స్నేహితుని ఇంటికి ప్రయాణమైనారు. ప్రయాణంలో భాగంగా నడుస్తూ గుణదల కాలువ వద్దకు వచ్చారు. దానిని దాటిన తర్వాత ఓ పెద్ద బంగ్లా కనిపించింది. ఆ బంగళాలో మాణిక్యం అనే తన స్నేహితుడు ఉన్నాడని తెలిసి ఇద్దరు కలిసి ఆ బంగ్లా వద్దకు వెళ్ళారు. మాణిక్యం ఒక విదేశస్తునితో మాట్లాడుతున్నాడు. కృపాదానంను చూచి సంతోషంగా వచ్చి కృపాదానంను వెంబెట్టుకొని దొరగారి వద్దకు తీసుకెళ్ళాడు. అందరు తెల్లని బంగ్లా ముందు ఉన్న పూలతోట వద్దకు కూర్చున్నారు. దొరగారు అమెరికా దేశము నుండి వచ్చి మెట్రోపొలిటన్ మిషన్‌ను స్థాపించి నూజివీడు ప్రాంతములో సేవ చేస్తున్నారు. కృపాదానం వారితో మాట్లాడి సెలవు తీసుకొని తన కొరకు వేచివున్న స్నేహితుని వద్దకు వస్తుంటే మాణిక్యం మరలా వచ్చి దొరగారు పిలుస్తున్నారని చెప్పాడు. మీరు ఏమి పనిచేస్తున్నారు? అని అడిగాడు దొర. ఇన్సూరెన్స్ ఇన్‌స్పెక్టర్ అని చెప్పాడు. మొదటి నుండి అదే పని చేస్తున్నారా? అన్నాడు దొర. సేవ చేయటం మా దంపతులకు ఇష్టం అన్నాడు కృపాదానం. మీ భార్య ఏమి పని చేస్తుంది? అన్నాడు దొర. టీచర్ అన్నాడు కృపాదానం. దొరగారి ముఖం వెలిగింది. అయితే మీరిద్దరు వచ్చి మెట్రోపొలిటన్ మిషన్‌లో పనిచేస్తారా? అన్నాడు దొర. మేము మా పెండ్లి అయినప్పటి ఇద్దరం కలిసి సేవ చెయ్యాలి అనుకున్నాము. ఆ విషయం నిమిత్తం ప్రార్థిస్తు న్నాము అన్నాడు కృపాదానం. నీ భార్య టీచర్‌గా ఆమెకు ప్రతి నెల జీతము ఇస్తాము అయినా ఆమె కూడా సేవకురాలే. మీరు ఒక్కరే రావిచెర్ల అనే గ్రామములో చెన్నలయ్య గారి వద్ద ఒక నెల తర్ఫీదు పొందిన తర్వాత కుటుంబముతో వచ్చి ఉద్యోగంలో చేరండి అన్నారు. ముగ్గురు కలిసి ఆఫీసు గదిలోనికి వెళ్ళారు. అక్కడ కొన్ని కాగితాల మీద కృపాదానం సంతకం చేశారు. దొరగారు వంద రూపాయలు ఇచ్చారు. పది గంటలకు పినపాడు చేరారు ఇద్దరు. భార్యభర్తలు ఇద్దరు కలిసి సేవ చెయ్యాలనే వారి హృదయ వాంఛను ఈ రీతిగా తీర్చిన

ప్రభువుకు కృతజ్ఞతతో ప్రార్థించారు.

1948లో కృపాదానం తూర్పుగోదావరి జిల్లా సామర్ల కోటలో సంతవీధి దగ్గర బాప్టిస్టుచర్చికి లూథరన్‌చర్చికి మధ్యలో ఉన్న ఓ ఇంటిలో కాపురం ఉన్న సమయంలో స్థానిక పెంతెకోస్తు మిషన్ వారితో ఎక్కువగా సహవాసం కలిగి ఉండేవారు. ఏ వ్యాధి వచ్చినా ఏమి వచ్చినా మందు లు వాడేవారు కాదు.ఒకరోజు కాకినాడ (9మైళ్ళు) వెళ్ళవలసి వచ్చింది. పెద్ద కుమారుడు సామ్యేలును సైకిల్ వెనుకవైపు, రెండవ కుమారుడు జోసఫ్‌ను ముందు కూర్చోపెట్టుకొని కాకినాడ ప్రయాణమైనారు. వెనుక కూర్చున్న శ్యామ్ కుడి కాలు చక్రంలో పడింది. గిలక క్రింది భాగము చర్మం అంతా చుట్టుకొనిపోయింది. గుడ్డపెట్టి కట్టుకట్టి ప్రార్థన చేసి వెనక్కి తిరిగి ఇంటికి వచ్చారు ముగ్గురు. అంత పెద్ద గాయమైనా డాక్టర్‌ను సంప్రదిం చలేదు. ఆ గాయం అదే తగ్గిపోయింది.

1952లో నూజివీడు దగ్గర ఈదర గ్రామములో కృపాదానంగారు పాదిరిగా పనిచేస్తున్న సమయంలో పిల్లల చదువు నిమిత్తం ఒంగోలు వెళ్ళవలసి వచ్చింది. రెండవ కుమార్తె మార్తను పెద్ద కుమారుడు శ్యామ్‌ను, రెండవ కుమారుడు జోసఫ్‌ను ఒంగోలు ఏ.బి.యం.హైస్కూలులో చదివించాలని నిశ్చయించుకొని, ప్రయాణంలో భాగంగా విజయవాడ వచ్చి తెలిసిన వారింట్లో లగేజి పెట్టి ఇద్దరు కుమారులను తీసుకొని బజారు బయలు దేరాడు. సంజీవ రెడ్డి విగ్రహం (లాకులు) వచ్చేటప్పటికి శ్యామ్ పెద్దగా అరచి ఆగిపోయాడు. మూడంగుళాల సీల శ్యామ్ కుడికాలు మడిమలోనికి దిగబడి పైన గిలక వద్దకు వచ్చింది. కృపాదానం గారు ప్రక్కనున్న సైకిల్ షాపులో కటింగ్ ప్లేయర్ తీసుకొని ఆ సీలను బయటకు లాగివేశారు. అంతేకాని ఎటువంటి మందులు వాడలేదు.

1962లో రెండవ కుమారుడు జోషికి దాదాపు 20 సం॥ల వయస్సులో డబుల్ న్యుమోనియా వ్యాధి వచ్చింది. వ్యాధి కారణంగా ఆహారం ఏమి తీసుకోలేకపోయేవాడు. హై ఫీవరు, దగ్గు ఆగకుండా వస్తుండేది. కృపాదానంగారు ఉదయం సాయంకాలం ప్రార్థన చేసేవారు. జోసఫ్‌కి తండ్రి తనను ఆస్పత్రికి ఎందుకు తీసుకొని వెళ్ళటంలేదో అర్థం అయ్యేది కాదు. గుంటూరులో నర్సుగా పని చేస్తున్న తన పెద్దక్క ఆస్పత్రికి రమ్మని, వ్యాధికి తగిన చికిత్స తీసుకోమని ఉత్తరాలు వ్రాస్తుండేది. జోషికి కండ్లు సరిగా కనబడటం లేదు. ఆహారం ఏమి తీసుకోవటం లేదు. ఏదైనా తీసుకున్నా కడుపులో ఇమడటం లేదు. వాంతి అయ్యేది. చాలా మంది ఇది క్షయవ్యాధి ఏమో అని అన్నారు. కృపాదానంగారి ప్రక్క ఇంట్లో ఉన్న వ్యక్తి పూర్వం క్షయ వ్యాధిగ్రస్తుడు. వాస్తవానికి జోషికి అనారోగ్యం కలిగిన సమయానికి ఆ ప్రక్కింటి అతనికి క్షయ వ్యాది పూర్తిగా నయమైంది. ఆయనతో ఎక్కువ గా సమయం గడిపేవాడు కనుక ఆ వ్యాధి తనకు అంటు కుందేమోనని అనుకునేవాడు జోషి. కృపాదానంగారు మాత్రం ఏమి తొణకకుండా భయపడవద్దు, ప్రభువు స్వస్థపరి చాడు అని అంటుండేవాడు. అలా రెండు వారాలు గడిచి పోయాయి. ఎవరు ఎన్ని చెప్పిన తన ఆరోగ్య విషయంలో తండ్రి వ్యవహారశైలి కొంచెం కూడ మారలేదు. రోజు రోజుకు తన ఆరోగ్య పరిస్థితి క్షీణించసాగింది. ఎంతకి తండ్రి తనను ఆసుపత్రికి తీసుకెళ్ళకపోవడంతో, ఒకరోజు జోషి ధైర్యం చేసి "గుంటూరు వెళ్ళి పెద్దక్క ద్వారా వ్యాధి నిర్థారణ చేసుకొని వద్దాము" అన్నాడు. కృపాదానంగారు కుమారుని ఆతృత చూసి గుంటూరు తీసుకొని వెళ్ళారు. మరునాడు హాస్పిటల్‌కి వెళ్లగా డాక్టరుగారు పరీక్ష చేసి ఏ వ్యాధి లేదు. బలహీనత మాత్రమే. న్యుమోనియా జ్వరము పూర్తిగా తగ్గిపోయినది అని చెప్పాడు. ఆ సాయంకాలం ఒంగోలు తిరిగి వచ్చారు. మరునాటి నుండి ఏ వ్యాధి లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు జోషి.

పిల్లలకు ఏదైనా అస్వస్థత కలిగితే ముందు తల్లిదండ్రులు కలత చెందుతారు కాని 12 మంది బిడ్డలకు తండ్రి అయిన కృపాదానంగారు ఏ వ్యాధికైన మందు ప్రార్థనే అని చెప్పేవాడు. కేవలం చెప్పడమే కాదు అనుసరించి చూపించేవాడు. చిన్నబిడ్డలని కంగారుపడక దేవుని మీద సంపూర్ణ విశ్వాసం చూపి అనేకమార్లు ప్రార్థనాశక్తిని అనుభవించాడు.

**( సశేషం)**

# భయపడకు దిగులు చెందకు

భయము, దిగులు ఈ రెండూ దేవున్ని నమ్మని వాళ్ళ జీవితాలలో ఎప్పుడూ ఉంటాయి. ఎందుకు భయపడతారు, ఎందుకు దిగులు చెందుతారంటే అది వాళ్ళ జీవితాల గురించే. మనిషి ఈ భూమ్మీద జీవించే కాలం దేవుడు నిర్ణయించిన ప్రకారం 70 లేదా 80 సంవత్సరాలు. ఏ మనిషికైనా వాళ్ళ జీవితం ప్రారంభమయ్యేది వాళ్ళ గురించి వాళ్ళు ఆలోచించుకోవడం మొదలుపెట్టినప్పటి నుండే. సహజంగానే యుక్త వయసు వచ్చినప్పటి నుండి వాళ్ళ జీవితం గురించి ఆలోచించటం ప్రారంభిస్తారు. ఏం చేయాలి? ఎలా బ్రతకాలి? అని ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి ఈ భయం, దిగులు ప్రారంభమవుతాయి. ఎవరైతే వాళ్ళ జీవితాలని వాళ్ళే నడిపించుకోవాలనుకుంటారో వాళ్ళు ప్రతిదానికి భయపడే పరిస్థితులు ఎదుర్కొంటారు. చిన్నప్పటి నుండి దేవునియందలి భయభక్తులతో పెరిగినవాళ్ళ జీవితాలలో ఈ భయము, దిగులు కనిపించవు. వాళ్ళు ప్రతి విషయాన్ని దేవునికి అప్పగిస్తారు కాబట్టి నిశ్చింతగా ఉంటారు. 'కొండలతట్టు నా కన్నులెత్తుచున్నాను నాకు సహాయము ఎక్కడ నుండి వచ్చును?" అన్న ప్రశ్నకు "యెహోవా వలననే నాకు సహాయము కలుగును" అన్న జవాబు వాళ్ళ దగ్గర ఉంటుంది. అందుకే దేవున్నిబట్టి చాలా ధైర్యంగా ఉంటారు. కనాను దేశాన్ని స్వాధీనపరచుకోడానికి ముందు దేవుడు యెహోషువతో *'నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము, జడియకుము, నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును' (యెహోషువ 1:9)* అని ఎంతో ధైర్యం చెప్పాడు. ఎందుకంటే అక్కడ ఎంతోమందితో యుద్ధం చేయాల్సి ఉంది. ఆ యుద్ధాలని ఎదుర్కొనేటప్పుడు 'దేవుడు నాతో కూడా ఉన్నాడు' అని యెహోషువ గుర్తుపెట్టుకోవాలని దేవుడు ధైర్యం చెప్పాడు. యుద్ధం లేకుండా, పోరాటం లేకుండా ఇశ్రాయేలీయులను కనాను దేశంలో ప్రవేశింపజేయగల శక్తి దేవునికి ఉన్నప్పటికీ, వారితో యుద్ధం చేయడం ద్వారా దేవుని మీద ఆధారపడతారా లేదా అన్నది వారికి పరీక్ష. అసలు ఎలాంటి యుద్ధం లేకుండా కనాను దేశంలో ప్రవేశిస్తే దేవుని అవసరం ఇశ్రాయేలీయులకు ఉండదు. మనం కూడా ఈ లోకంలో ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సమస్యలను ఎదుర్కోడానికి మనం దేవుని సహాయం తీసుకుంటామా లేదా అన్నది మనకి పరీక్ష. మనకి ఎలాంటి సమస్యలు లేకపోతే దేవున్ని ఒక్క క్షణం కూడా గుర్తు చేసుకోము. ఈ లోకంలో మనం జీవించేటప్పుడు ప్రతి విషయానికి భయపడుతూ, దిగులుపడుతుంటాము. మనుష్యులు బలహీనులని దేవునికి తెలుసు. అందుకే దేవుడే స్వయంగా మనుష్యులతో చెప్తున్నాడు 'భయపడకుము, దిగులు పడకుము' అని. దేవుడే స్వయంగా చెప్పినా మనం ఇంకా భయంతో, దిగులుతో ఉంటే దేవుడు మాత్రం ఏం చేయగలడు? దేవున్ని నమ్మని వాళ్ళ జీవితాలు దిగులు, భయంతోనే ముగుస్తాయి. దేవున్ని నమ్మిన వాళ్ళ జీవితాలలో ఈ భయము, దిగులు తాత్కాలికమే. భయపడినా, దిగులుపడినా వాళ్ళకు వెంటనే దేవున్నిబట్టి ధైర్యంగా ఉంటారు. కాబట్టి దేవుడు మనతో కూడా ఉన్నాడని దేవున్నిబట్టి ధైర్యంగా ఉందాము. ఆమేన్.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

"మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" ఈ మాట యేసుప్రభువు నోటనుండి వచ్చినది. మనుష్యుడు ఈ లోకములో జన్మించినది మొదలు మరణించేటంత వరకు అతనికి – దేవుని అవసరత ఉన్నది, సిరి యొక్క అవసరత ఉన్నది. దేవుడు లేడు – అని ఇతరులకు చెప్పి వాదించేవారు కూడా తమ హృదయాంతరంగములో దేవుని మీద ఆధార పడి తనకు తెలియకుండానే ఆయనను ధ్యానిస్తారు. అదే విధముగా ప్రతి మానవుడు ఈ లోకములో తను జీవించి నంతకాలములో ఎక్కువగా ఆలోచించేది ధ్యానించేది 'సిరి'ని గురించే. సిరికి మూలం ధనము. మనం మన జీవితములో ఉదయం నుండి సాయంకాలం వరకు దేనిని గురించి ధ్యానము చేస్తున్నాము? ఆలోచించండి.

ఏ కొదువ లేకుండా జీవించాలని అంటే – సమాధాన ముతో, సంతోషముతో జీవించాలని మన కోరిక. ఇవి మనకు ఎక్కడ లభిస్తాయి? దేనిద్వారా లభిస్తాయి? అని ఆలోచిస్తే కొంత వరకు డబ్బు ఉంటే సుఖంగా జీవించవచ్చు అనిపిస్తుంది. కానీ డబ్బుతో వచ్చే సుఖం, సంతోషం స్థిరంగా మన దగ్గర నిలచిపోతాయా? ఖచ్చితంగా ఉండవు. ఎందు కంటే మన దగ్గర ఉన్న సిరిని ఎవరూ దొంగిలిస్తారమో, మాయమాటలు చెప్పి మంచిగా తీసుకొని ఎగవేస్తారా? ఇటువంటి ఆలోచనలతో కంటి మీద కునుకు ఉండదు. ఇక శాంతి సమాధానాలు ఎలా ఉంటాయి? ఇటువంటి ఆలోచనలు చిన్నపిల్లలకు రావు. కనుకనే *"పరలోకరాజ్యము ఈలాటిరిది"* అన్నాడు యేసుప్రభువు.

మన డబ్బు ఎక్కడ ఉంటుందో మన హృదయం అక్కడే ఉంటుంది. కనుక దివారాత్రము దేవుని వాక్యము మనం ధ్యానించలేం. ఈ లోకంలో మనం దేనిని ఎక్కువగా ప్రేమిస్తామో అది మనకు విగ్రహం అవుతుంది. ఏదో ఒకటి ఎవరో ఒకరు మాత్రమే మనిషి హృదయంలో నివసించ గలదు. ఇందులో కొంచెమైనా సందేహము లేదు. దేవునిని, సిరిని ప్రేమించలేము. కనుక మనకు ఇవ్వబడిన సిరిని మన తక్షణ అవసరాలకు ఖర్చుచేసి మిగిలినది దాచుకోవాలి. ఎక్కడ దాచుకోవాలి? దేవుని దగ్గరే! దేవుని దగ్గర సిరిని దాచుకోవటానికి ఎన్నో అకౌంట్సు అందుబాటులో పెట్టాడు దేవుడు. మనము దేవునియందు విశ్వాసముంచితే ఆయన బ్యాంక్‌లోనే మన సిరిని డిపాజిట్ చెయ్యాలి. ఈపని విశ్వాసంతోనే చెయ్యగలము. మన డిపాజిట్‌లకు దేవుడిచ్చే వడ్డీ చాలా గొప్పది. యేసుప్రభువు చెప్పిన ఏ మాటకైనా ఆయన కట్టుబడి ఉంటాడు. ఆయన నమ్మదగిన దేవుడు. *"భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకములో మీ కొరకు ధనము కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దానిని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు"* అని ప్రభువు అన్నాడు.

పరలోకములో ధనము దాచుకొమ్మంటే – దాచుకోవ డమే. దీనికి రకరకాల వ్యాఖ్యానాలు చేయనవసరము లేదు. మనల్ని మోసం చేసి మన డబ్బును వాళ్ళ బ్యాంక్‌లో దాచు కొమ్మని చెప్పే ఈ లోకపు మోసగాళ్ళ మాటలు కావు. ప్రతి మానవుడు తన జీవితాన్ని, తన కుటుంబం మొత్తాన్ని నడిపి స్తాడు. భద్రంగా కాపాడుతాడు అని నమ్మాలి. డబ్బు కూడా దేవుని సెలవులేనిదే మనకు సహాయపడదు. *"అస్థిరమైన ధనము నందు నమ్మికయుంచక సుఖముగా అనుభవిం చుటకు సమస్తమును మనకు ధారాళముగా దయ చేయు దేవునియందే నమ్మిక యుంచుడి"* 1తిమోతి 6:17

దేవుని సేవకులు, విశ్వాసులమని చెప్పుకొనేవారు కూడా ఏ పనిచెయ్యాలన్నా సేవాకార్యక్రమము జరిగించా లన్నా దేవునిమీద కంటే చేతిలో ఉన్న సిరి ఇచ్చే వనరుల పైన ఆధారపడియున్నందున అన్ని విషయాల్లో అధిక ఒత్తిడి పొందుచున్నారు.

# లోకంతీరు

(పుట్టుక చావు మధ్య సంబరం)

ఇంత ఖరీదైన ఈ శరీరాన్ని, వెలకట్టలేని ఆరోగ్యాన్ని దేవుడు మనకెందుకు ఇచ్చాడు? దాని వెనుక దేవునికి ఏదైనా ఉద్దేశం ఉందా? నిర్గమ.4:11లో దేవుడు *''మానవు లకు నోరిచ్చిన వాడు ఎవడు? మూగవానినేగాని, చెవిటి వానినేగాని, దృష్టిగల వానివానినేగాని, గ్రుడ్డివాని నేగాని పుట్టించిన వాడెవడు? యెహోవానైన నేనే గదా''* అని చెప్తున్నాడు. అంటే మనం ఎలాంటి అంగ వైకల్యముతో పుట్టకుండా, పరిపూర్ణ ఆరో గ్యంతో పుట్టటం అంటే దేవుని కృపే కదా! దేవుడు మనల్ని ఎంతగానో ప్రేమిస్తు న్నాడ నే కదా అర్థం. తన ఉచిత కృపతో మనల్ని ప్రేమించి మనకిచ్చిన ఈ శరీరంతో మనమేమి చేస్తున్నాం? ఈ శరీరాన్ని కేవలం ధనము సంపాదించటానికే ఉపయోగి స్తున్నాము కదా! అందుకేనా అరోగ్యవంత మైన శరీరాన్ని మనకిచ్చింది. దేవుడు ఆయన పనికోసం, ఆయన కోసం జీవించటం కోసం కాకపోతే ఇంత విలువైన, ఆరోగ్యవంతమైన శరీరాన్ని మనకి ఎందుకివ్వాలి? *''ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను'' (ఎఫెసీ. 1:4-6).* జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను కాబట్టే తల్లి గర్భములో ప్రవేశపెట్టబడిన కొన్ని కోట్ల మందిని కాదని నిన్ను, నన్ను ఏర్పరచుకున్నాడు. కాబట్టి మన పుట్టుక జగత్తు పునాది వేయబడక మునుపే నిర్ణయించబడినది. అయితే దేవుడు తన పోలికె చొప్పున, తన స్వరూపములో, తన స్వహస్తాలతో సృజించిన ఆదాము హవ్వలను దేవునికి దూరం చేసినట్లే, ఈ భూమ్మీది పుట్టిన ప్రతి ఒక్కరిని దేవునికి దూరం చెయ్యటమే సాతాను లక్ష్యం.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

మన శరీరానికి ఎంతో విలువ యిచ్చి, ఆరోగ్యమిచ్చి కాచి కాపాడుతున్న దేవుడికి మనిషి ఎంత విలువ ఇస్తున్నాడు? కేవలం శరీరానికి రోగం వస్తే తప్ప దేవున్ని తలుచుకొనే స్థితిలో లేదు మనిషి. అందుకనే మనిషికి ఎన్నో రోగాలు వస్తున్నాయి. మనిషి ప్రతి శరీర భాగానికి ఒక డాక్టరు ఉంటాడు. కళ్ళకి, ముక్కుకి, చెవికి, చర్మానికి, గుండెకి, మెదడుకి, ఊపిరితిత్తులకి, కిడ్నీలకి, ఎముకలకి, కాలేయానికి, నరాలకి, కండ రాలకి, ఇలా ప్రతి అవయవానికి ఒక డాక్టరు తయారవ్వడానికి కారణం మనమే కదా! *''మీరు ఈ విధులను విని వాటిని అనుసరించి నడుచుకొనిన యెడల... యెహోవా నీ యొద్ద నుండి సర్వ రోగములను తొలగించి, నీవెరిగి యున్న ఐగుప్తులోని కఠిన మైన క్షయ వ్యాధులన్నిటిని నీకు దూరపరచి...''* (ద్వితీ. 7:12-15). కాబట్టి దేవుడు మనల్ని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా పుట్టించిన తర్వాత, ఈ భూమ్మీద ఉన్న రోగాలలో ఏది రావాలన్నా దేవుడు అనుమతించాల్సిందే. దేవుడు తన బిడ్డలుగా ఉండే వారికి ఒక కంచె వేస్తాడు. అప్పుడు సాతాను ఆ మనుష్యులను ఏమి చెయ్యలేదు. దేవుడు యోబుకి కంచె వేసినట్లే, తన బిడ్డలైన ప్రతి ఒక్కరికీ కంచె వేస్తాడు. అప్పుడు ఏ రోగము వారి దరికి చేరదు.


ఈ భూమ్మీద మనలను పుట్టించిన దేవుడు మనం రోగాలతో చనిపోవాలని కోరుకోడు. ఈ లోకంలో మనం దేవుని ఇష్టప్రకారం జీవిస్తే ఏ రోగమూ మన దరి చేరదు. *''మీ దేవుడైన యెహోవా వాక్కును శ్రద్ధగా విని ఆయన దృష్టికి*

న్యాయమైనది చేసి, ఆయన ఆజ్ఞలకు విధేయులై ఆయన కట్టడలన్నిటిని అనుసరించి నడచిన యెడల, నేను ఐగుప్తీయులకు కలుగ జేసిన రోగములలో ఏదియు మీకు రానియ్యను" (నిర్గమ. 15:26). చాలామంది డబ్బు దాచి పెట్టుకోవడానికి కారణం 'భవిష్యత్‌లో ఏమైనా రోగాలు వస్తే నయం చేసుకోవడానికి' అని చెబుతారు. "నిన్ను స్వస్థ పరచు యెహోవాను నేనే" (నిర్గమ. 15:26) అని చెప్పినా జబ్బులు నయం చేసుకోవడానికి డబ్బు మీద ఆధార పడతారు. కాబట్టి ఇంక దేవునితో పని ఉండదు. ఎంత డబ్బు ఖర్చు చేసినా జబ్బు నయం కాకపోతే అప్పుడు దేవుని దగ్గరకు వస్తారు. శరీరాన్ని ఇచ్చింది దేవుడే కాబట్టి శరీరానికి కావలసిన ఆరోగ్యాన్ని కూడా ఆయనే దయచేస్తాడు. కానీ మనిషి వివిధ తంత్రములు కల్పించుకొని, దేవుని కి దూరమై, దేవునికి వ్యతిరేకమైన పనులతో దేవునికి కోపం పుట్టించి రోగాల పాలవు తున్నాడు. ఎన్నో అంతుచిక్కని వ్యాధులు ఈ లోకంలోకి ప్రవేశించాయి. డాక్టర్లు కూడా అది ఏం వ్యాధో అర్థం కాక ఆ రోగానికి ఏదో ఒక పేరు పెట్టి చేతులెత్తేస్తున్నారు. వైద్యశాస్త్రానికి మించిన రోగాలు నేడు విస్తరిస్తున్నాయంటే మనిషి దేవునికి ఎంత అవిధే యుడయ్యాడో అర్థం చేసుకోవచ్చు. రోగాలు వస్తే డబ్బుతో నయం చేసుకోవచ్చు అన్న భ్రమలో మనిషి డబ్బు సంపా దిస్తున్నాడు. తీరా చూస్తే నయం కాని రోగాలతో డబ్బు ఎందుకూ పనికి రాకుండా పోతుంది. తన ఆస్తి అంతా రాసిచ్చినా డాక్టర్లు నయం చేయలేని జబ్బులు ఎన్నో ఉన్నాయి. మందులతో కొంత ఉపశమనం కలుగుతుందే తప్ప పూర్తిగా నయం కాదు. రోగం రాకుండా చేయగలిగేది, వచ్చిన రోగాన్ని స్వస్థపరచగలిగేది దేవుడొక్కడే.

**చావు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

"ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము" (1తిమోతి 6:10). ఏదెను తోటలో ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞని ధిక్కరించి మరణాన్ని ఎలా కొని తెచ్చుకున్నారో, ఈనాడు ప్రతి ఒక్కరూ డబ్బు జోలికి వెళ్ళి జబ్బులు కొని తెచ్చు కుంటున్నారు. ప్రతి ఒక్కరూ వాదించేది ఏంటంటే, డబ్బు లేకుండా ఎలా బ్రతకాలి? అని. మనిషి బ్రతకటానికి డబ్బే అవసరమైతే "మీరు దేవునికిని సిరికిని దాసులుగా ఉండ నేరరు" అని డబ్బుకు వ్యతిరేకంగా దేవుడు ఎందుకు మాట్లా డతాడు. అసలు మనిషికి డబ్బెందుకు? తన అవసరాలు తీర్చుకోవడానికే కదా! మరి ఆ అవసరాలేవో దేవుని ద్వారా తీర్చుకోవచ్చు కదా! తన అవసరాలు తీర్చుకోడానికి డబ్బు మీద కాకుండా దేవుని మీదనే ఆధార పడోచ్చు కదా! మనిషి దేవుని మీద ఆధారపడితే, దేవుడు మనిషిని ఎందుకు సృజించుకున్నాడో ఆ ఉద్దేశం నెరవేరుతుందని సాతానుకు తెలిసి, మనిషిని దేవునికి దూరం చెయ్యా లన్న కుట్రతో మనిషిని డబ్బు వైపుకు మరులు కొల్పింది. మనిషి జీవించటానికి అవసరం లేని విలాసవంతమైన జీవితాన్ని మనిషికి ఎరగా వేసి, అవి సంపాదించు కోవడానికి అక్రమమార్గాలవైపు మనిషిని పురికొల్పింది. ఒక్కసారి విలాస వంతమైన జీవితానికి అలవాటు పడిన మనిషి దానికి బానిసైపోతాడు. "ధనాపేక్షలేనివారై మీకు కలిగిన వాటితో తృప్తి పొందియుండుడి" (హెబ్రీ. 13:5). కలిగిన వాటితో అంటే దేవుడు మనకు ఇచ్చిన తెలివితేటలు, ఆరోగ్యము తోనే తృప్తి కలిగిఉండాలి. దేవుడు మనకిచ్చిన తెలివి తేటలతో ఆయనను గుర్తించి, ఆయన ఇచ్చిన ఆరోగ్యంతో ఆయన పనిచేయాలి. అంతే తప్ప డబ్బు సంపాదించుకో వడానికి తెలివితేటలు, విలాసవంతమైన జీవితం గడపటా నికి ఆరోగ్యం ఇవ్వలేదు. ఒకవేళ దేవుడు మనల్ని గ్రహణం మొఱ్ఱి వాళ్ళలాగానో, మతిస్థిమితం లేనివాళ్ళుగానో పుట్టించి వుంటే అప్పుడు దేవుడిని గుర్తించలేము. ఒకవేళ అనారోగ్యం తో పుట్టించి వుంటే, దేవుని కోసం ఏమి చెయ్యలేము కదా! కాబట్టి దేవుడు మనల్ని పుట్టించింది ఆయన కోసమే తప్ప లోకం కోసం కాదు. **(ఇంకా వుంది)**



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 7

**అడ్డం :**

1. మన్నా ఈ గింజలవలె ఉండెను (4) (తారుమారు)
4. దేహము పరిశుద్ధాత్మకు ఏమైయున్నది (4) (1కొరింథీ)
7. తిరగబడిన హెబ్రీ బోధకుడు (2)
8. నిరీక్షణను కలుగజేయునది తారుమారైంది (3) (రోమా)
9. యెఫ్తా కుమార్తెను ప్రసిద్ధి చేయుట ---(2) (న్యాయా)
10. తిరగబడిన అబీనోయము కుమారుడు (3) (న్యాయా)
12. దేవుడు సమస్తమును నరపుత్రుని ---- ల క్రింద ఉంచెను. (3) (తికమక) (హెబ్రీ)
15. ఐగుప్తు రాజు (1) (2 రాజులు)
17. తికమకగా దేవుని సముఖమందు నిలుచుదూత (4)
18. నోవహు ఓడ నిలిచిన పర్వతం (4)
20. రొట్టె ---12 గంపలు నింపిరి. (3) (ఒత్తులోపించింది)
22. తిరగబడిన శారా దాసి (3)
24. షోమ్రోను పట్టణాన్ని కట్టించిన రాజు (2)
25. యేసు ఉపమానాలలో ఒకటి.గోధుమలు, --- లు (3)
26. గర్వపు మాటలు మీ --- (2) రానియ్యకుడి
27. ప్రభువు అననీయను వెళ్ళమన్న వీధి ----- (4) (తిన్నగా లేదు) (అపొ.కా)
29. యోబు ఒళ్ళు గోకుకొను సాధనం (4) (తారుమారైంది.)

**నిలువు :**

1. తోకతెగిన ఇశ్శాఖారీయుల పట్టణం (2)(యెహో)
2. నీతి --- ఆకలిదప్పులుగలవారు ధన్యులు (3)
3. బండ నుండి నీరు వచ్చిన చోటు (3)
4. నీతిమంతునికి కలుగు --- లు అనేకములు(3)
5. తారుమారైన అన్న అల్లుడ్ని పిలవండి (3)
6. పగవాడు లెక్కలేని -- లు పెట్టును (2) (సామె)
11. సున్నతి చేయుటకు యెహోషువ ఉపయోగించిన పనిముట్టు తారుమారైంది (5)
13. తారుమారైన పరమగీతములలోని రాగం (5)
14. --- పునాది వేయబడకమునుపే నీవు నన్ను ప్రేమించితివి (3) (యోహాను)
16. నిద్రాభారము వలన జోగి 3వఅంతస్తు నుండి క్రిందపడి చనిపోయిన యవ్వనస్తుడు (3) (అపొ.కా)
19. ఆమోను దేవత ఉందు పట్టణం (1) (యిర్మీ)
20. తలక్రిందులైన నీటి తావులు (3) (యెషయా)
21. ఆయన కోసరమే --- పడవలెను (3) (తలక్రిందులుగా) (యెషయా)
22. యెష్షయి మొద్దు నుండి పుట్టునది తలక్రిందు లైంది (3) (యెషయా)
23. దేవునితో నడిచినవాడు (3) (దీర్ఘంతో)
24. న ఒత్తులేని షెమయా కుమారుడు(2) (1దిన)
27. యెహోవాదృష్టికి పాపము చేసిన జనుల మాంసము--వలె పారవేయబడును (2) (జెఫన్యా) (క్రింద నుండిపైకి)